RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 71 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 12-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥నవమి తె॥ 4.20, మూల రా ॥11.00, వర్జ్యం ఉ॥6.00 వరకు, దుర్ముహూర్తం ఉ॥10.14-11.01, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥1.30-3.00, సూర్యోదయం ఉ॥ 6.17, సూర్యాస్తమయం సా॥ 6.04 గం॥

అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం

సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది 2లో

పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా!

-కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని

-గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం

- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు

- కేరళ పర్యటనలో ప్రధాని మోదీ ఘాటు విమర్శలు

తిరువనంతపురం,మార్చి11(ఆర్ఎన్ఎ): ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో మిగతా 2లో..

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

-క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యల ఆకళింపు -2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు

-ఉగాదికి 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు -రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించేలా చర్యలు

-సౌర వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి :కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి,మార్చి11(ఆర్ఎన్ఎ): సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. అధికారులు-ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు

చేయాలన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం. గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ ఛార్జీల భారం వేస్తే.. మేం ట్రూడౌన్ చేశాం. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం అని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టి ప్రభత్వ విధానాలపై క్లారిటీ ఇస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్, గుడ్ గవర్నెన్స్ బ్యాలెన్సింగ్ చాలా అవసరమని చెప్పారు. వర్చువల్, ఫిజికల్ వర్కింగ్ ఈరోజు రీయాలిటీగా మారుతోందని సీఎం అన్నారు. 'పర్వాలేదు' అనే ఉదాసీనత కూడా చేయాల్సిన పనులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. గతంలో విజన్ 2020 పెట్టినప్పుడు చాలామంది విమర్శించారని.. ఇప్పుడు అది ఫలితాన్ని ఇవ్వడంతో 2047 వైపు అందరూ చూస్తున్నారని సీఎం అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో నిర్దిష్టమైన టార్గెట్‌లను ఫిక్స్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈసారి 15 పాయింట్లను ఈ ఏడాది లక్ష్యాల కింద ఇస్తున్నట్లు చెప్పారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని అన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమం ఎప్పుడు చేస్తామో ముందే చెబుతామని.. దానికి తగ్గ ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ నెలలో 13వ 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు సీఎం. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్మును జమ చేస్తుందన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులతో కలిసి 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్దామని సీఎం తెలిపారు. ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే ప్రిపరేటరీ వర్క్ చేయాలని సీఎం సూచించారు. మే 15న నీటిని విడుదల చేస్తున్నామని, ఈ సీజన్లో ముందుగానే నీరు ఇస్తామన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు 'ఇంద్రధనస్సు' పేరుతో ఉచిత బస్సు మిగతా 2లో..

డ్వాక్రా ఉత్పత్తులకు ప్రమోషన్

-కలెక్టర్లకు

సిఎం చంద్రబాబు సూచన

అమరావతి,మార్చి11(ఆర్ఎన్ఎ): డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలని కలెక్టర్లను ఎపి సిఎం చంద్రబాబు ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో నిర్వహించిన భేటీలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్' అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తులను 'స్వయం' బ్రాండ్ పేరుతో ప్రమోట్ చేస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అమూల్ తరహాలో స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ చేయాలని చెప్పారు. డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు స్వయం పేరిట బ్రాండింగ్.. లోగో ఏర్పాటు చేశామన్నారు. మల్టీ బిలియన్ డాలర్ల కంపెనీ తరహాలో బ్రాండింగ్‌కు కృషి చేయాలని కోరారు. అమూల్ తరహాలోనే సహకార విధానంలో మార్కెటింగ్ జరగాలన్నారు. డ్వాక్రా మహిళలు రుణాలను తప్పకుండా తిరిగి చెల్లిస్తారని, వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి అని చంద్రబాబు తెలిపారు.

వివేకా హత్య కేసులో సుప్రీం విచారణ

-అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్లు తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో మూడో సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరఫు న్యాయవాది చెప్పారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సునీత తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టును ఆశ్రయించ వచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని ఆదేశించింది. కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు మిగతా వారి బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటీషన్లను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. మూడో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసినట్లు న్యాయస్థానానికి సీబీఐ అధికారులు తెలిపారు. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరఫు న్యాయవాది వెల్లడించారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సుప్రీంకోర్టుకు సునీత తరఫు న్యాయవాది సిద్దార్థ లూథ్రా వివరించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలు, ఆధారాల కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులో మిగతా 2లో..

మహిళా సమస్యల పరిష్కారం కోసం జన్ సున్వాయ్

-వేగంగా, పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి చొరవ

- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

విజయవాడ,మార్చి11(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. బుధవారం విజయవాడ లోని గోపాల్ రెడ్డి రోడ్డు నందుగల జల వనరుల నిర్వహణ, సమగ్ర రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించి విచారించారు. అనంతరం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 9న నెల్లూరు జిల్లాలో జన్ సున్వాయ్ కార్యక్రమాన్ని మొదలు పెట్టామన్నారు. ఈనెల మిగతా 2లో..

ఆంధ్రాను అప్పలకుప్ప చేసారు!

-పెట్టుబడుల పేరుతో మభ్య పెడుతున్నారు

-అప్పులు రూ.81,071 కోట్లని తేల్చిచెప్పిన కాగ్

-మీడియా సమావేశంలో జగన్ విమర్శలు

అమరావతి,మార్చి11(ఆర్ఎన్ఎ): చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి రాబడులు తగ్గాయని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయం తగ్గింది.. అప్పులు పెరిగాయన్నారు. తాను చెప్పిన విషయాలనే కాగ్ రిపోర్టు చెప్పింది అని అన్నారు. 2023-2024లో ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.2,36,486 కోట్లు అని తెలిపారు. 2023-2024లో రాబడులు రూ.1,70,767 కోట్లు, చంద్రబాబు వచ్చాక తొలి ఏడాది ఖర్చు రూ.2,49,906 కోట్లు అని, రాబడులు రూ.1,68,024 కోట్లు మాత్రమేనన్నారు. వైసిపి మీద తప్పుడు ప్రచారాలు చేస్తూ మరోవైపు ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నారని, చేస్తున్న అప్పుల్ని బయటకు రానీయకుండా దాచేసే ప్రయత్నం చేస్తున్నారు అని చెప్పారు. 2024-25లో చేసిన బడ్జెట్ అప్పులు రూ.60,485 కోట్లని వీళ్ల ప్రభుత్వం చెబుతోందని, కాని కాగ్ మాత్రం ఆ ఏడాదిలో చేసిన అప్పులు రూ.81,071 కోట్లని తేల్చిచెప్పింది అని వైఎస్.జగన్ అన్నారు. చంద్రబాబు హయాంలో రెవిన్యూ లోటు రూ.60,285 కోట్లు అని అన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గింది, ఖర్చులు పెరిగాయని విమర్శించారు. సిఎం చంద్రబాబు మిగతా 2లో..

హర్ముజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్, పలు నౌకలు ధ్వంసం

టెహ్రాన్,మార్చి11(ఆర్ఎన్ఎ): చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్ముజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అవి ధ్వంసమయ్యాయి. తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు మిగతా 2లో..

ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

-15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం

లాస్ ఏంజిల్స్,మార్చి11(ఆర్ఎన్ఎ): ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్‌కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా మిగతా 2లో..

లోక్‌సభ స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

-స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం: అమిత్ షా

దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి నేటి వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.

స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం: అమిత్ షా

"స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. భారత ప్రజాస్వామ్యాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. స్పీకర్ ఉద్దేశాలను ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరంలేదు. స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం. స్పీకర్ స్థానం దిశగా ప్రతిపక్షసభ్యులు పేపర్లు విసిరారు. అందరూ లోక్‌సభ నిబంధనలు పాటించాలి. సభలో ఎలా మాట్లాడాలో థరూర్ నేర్పించాలి. కాంగ్రెస్ నేతలకు థరూర్ ఎందుకు హిత బోధ చేయరు? కాంగ్రెస్ నిబంధనలు పార్లమెంటును నడపజాలవు. తప్పులు సరిదిద్దుకొనేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వచ్చింది" అని అమిత్ షా అన్నారు.

అమెరికా ఆర్థిక సంస్థలపై దాడుల చేస్తాం!

-అమెరికా యుద్ధంపై ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్,మార్చి11(ఆర్ఎన్ఎ): ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ సంస్థలు, బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా ఇలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, మిగతా 2లో..

మొదట మీరు పవిత్రులు కండి. ప్రపంచమంతా పవిత్రంగా కనబడితీరుతుంది. బలాన్ని స్మరించడమే బలహీనతలనుండి బయటపడే మార్గం, కానీ బలహీనులమని బాధపడడం కాదు.

నేటి మనదేశమ్ సంపాదకీయం

జల్‌జీవన్‌తో శాశ్వత నీటి సమస్య పరిష్కారం అయ్యేనా?

ఏటా వరదలు, నీటి కరువు సాధారణం అయ్యింది. వర్షాకాలంలో వరదలు ముంచెత్తితే.. ఎండాకాలంలో మంచినీటి కటకటలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన కలగడం లేదు. మనకు ఎన్నో జీవనదులు, సహజసిద్ధ వనరులు ఉన్నా, వాటిని వినియోగించడం ఎలా అన్న ఆలోచన చేయడం లేదు. ఎండాకాలం రాగానే తాత్కాలిక పథకాలతో మంచినీటి సమస్యను గట్టెక్కిస్తున్నారు. ఇకపోతే కేంద్రం జల్‌జీవన్ మిషన్ కింద లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని కేంద్ర ప్రభుత్వం 2028 డిసెంబరు వరకు పొడిగించింది. 2019–2024 వరకే పరిమితమైన ఈ పథకం చాలా రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాని విషయాన్ని ప్రభుత్వం పరిగణనలో తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మొత్తం కేటాయింపులను రూ.8.69 లక్షల కోట్లకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రాలకు రూ.1.51 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం కలగనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు జాతీయస్థాయిలో సుజలం భారత్ పేరుతో ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తేనుంది. దీనికింద ప్రతి పల్లెను ఒక సుజల గ్రామంగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయినట్లు గ్రామపంచాయతీలు ధ్రువీకరించి, ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పథకం నిర్వహణకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తాయి. పథకాన్ని ప్రజలు సొంతం చేసుకొని సామాజికంగా, ఉమ్మడిగా నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఏటా 'జల్ ఉత్సవ్' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని గ్రామాలనూ 'హర్‌ఘర్ జల్' గ్రామాలుగా తయారు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకానికి అవసరమైన నీటి వనరులను సమకూర్చడంలో మాత్రం రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. జల్‌జీవన్ పథకం అమల్లో ఉన్నా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తీరడం లేదు. కారణం నీటి వనరులను వినియోగించక పోవడమే. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణ మైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనా రాహిత్యంతో పాటు ప్రకృతి సహాయ నిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో అవ గాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలకేకాక, మండల కేంద్రాలకు, గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నా అడిగేవారు, అడ్డగించేవారు లేకుండా పోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు. ఇకపోతే లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రం పాలవుతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. పెడుతున్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్ర స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలున్నట్లు భూగర్భ శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్నది. విద్యుత్ డిమాండ్ తోపాటు నీటి వృథా కూడా పెరుగు తున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశం లోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతో సహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. రాబోయే వేసవిలో మంచినీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

-ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం -సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

అమరావతి,మార్చి11(ఆర్ఎన్ఎ): రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్లా అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనతో వెలగపూడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

విచారణకు ఆదేశించిన హోంమంత్రి అనిత

అమరావతిలోని వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్ర కోణం దాగి ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. ఘటనాస్థలంలో సమీప పొలం నుంచి మంట వచ్చిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. పొలంలో గడ్డి పేర్చి నిప్పుపెట్టిన ఆనవాళ్లను చూపించారు. అమరావతిలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన మంటలు చెలరేగి ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో పరిసరాల్లో దట్టంగా పొగ అలముకొంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అయితే ఘటనపై అనుమానాలు రావడంతో విచారణకు ఆదేశించారు.

మొదటి పేజీ తరువాయి

వివేకా హత్య కేసులో సుప్రీం విచారణ

సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఛార్జిషీట్ దాఖలు పూర్తి అయినందున నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జరపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. నిందితుల బెయిల్ రద్దు చేయాలని దర్యాప్తు సంస్థ, సునీత దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ కేసులో ట్రయల్ త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఆంధ్రాను అప్పులకుప్ప చేసారు!

వచ్చాక రెవిన్యూ లోటు 56 శాతం పెరిగిందన్నారు. రాబడులు తగ్గాయని, ద్రవ్య లోటు 30 శాతం పెరిగిందని తెలిపారు. కోవిడ్ ఉన్నా.. ఆదాయాలు తగ్గినా తాము హామీలు నెరవేర్చామని కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు అమాంతం పెంచారని ధ్వజమెత్తారు. నెట్ బారో సీలింగ్ పరిధి దాటిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత వరకు అప్పు తీసుకోవచ్చో కేంద్ర ప్రభుత్వం విధించే ఆ పరిమితి నెట్ బారో సీలింగ్ పరిధి దాటిందని చెప్పారు. చంద్రబాబు అండ్ కో దోచిపెట్టడమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. మట్టిని, ఇసుక, భూములు, లిక్కర్ దేన్ని వదలడం లేదు అని ఆరోపించారు. అన్నింట్లో దోపిడీయేనన్నారు. ప్రభుత్వానికి ఆదాయానికి ఎలా వస్తుంది, ప్రజలకు సంక్షేమం ఎలా అందుతుంది, వీళ్ల దోపిడికి వైజాగ్‌లో జరిగిన భూదోపిడీయే నిదర్శనం అని అన్నారు. ఓవైపు తమపై తప్పుడు ప్రచారాలు చేస్తారని మండిపడ్డారు. అప్పులు చేస్తారు ? ఆ అప్పులు బయట పడకుండా దాచేసే ప్రయత్నం చేస్తారు అని నిప్పులుచెరిగారు. కాగ్ రిపోర్టులో అప్పులు రూ.81,082.51 కోట్లు, కానీ అసెంబ్లీలో రూ.60,485.40 కోట్లు ఉందన్నారు. సుమారు రూ.20 వేల కోట్లు వ్యత్యాసం ఉంది అని అన్నారు. 16 రోజుల అసెంబ్లీ సమావేశాలతో ప్రజలు ఒరిగింది సున్నా అని విమర్శించారు. 2024–25లోనే పరిమితికి మించి రూ.17,953 కోట్లు అధికంగా అప్పులు తీసుకువచ్చారని? ఇక 2025–26 ఏడాదిలో పరిస్థితి ఇంతకన్నా కూడా ఘోరంగా ఉంది అని చెప్పారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు తెచ్చిన మొత్తం అప్పులు రూ.3.2 లక్షల కోట్లు అని అన్నారు. తమ హయాంలో చేసిన అప్పుల్లో 96 శాతం అప్పులు ఈ రెండేళ్లలోనే చేశారు అని తెలిపారు. తమ ఐదేళ్ల కాలంలో చేసిన అప్పులు కేవలం రూ.3.31 లక్షల కోట్లు మాత్రమేనన్నారు. ఎవరు జాగ్రత్తగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించారు, ఎవరు ఆర్థిక వ్యవస్థను డ్యామేజ్ చేశారన్నది కళ్లకు కట్టినట్టు కనిపిస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు అని చెప్పారు. విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతి, దోపిడీ కారణంగా రాష్ట్రానికి ఆదాయాలు రావడం లేదు అని అన్నారు. వనరులన్నింటినీ కూడా దోచేసి సొంత జేబులు నింపుకుంటున్నారు అని దుమ్మెత్తిపోశారు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్, లెటరైట్, గ్రానైట్, లిక్కర్, భూములు, అధిక రేట్లకు పీపీఏలు దేన్నీ వదిలిపెట్టడంలేదు అని చెప్పారు. దోపిడీ జరిగితే, ప్రభుత్వానికి ఆదాయాలు ఎలా వస్తాయి? సంక్షేమం, అభివఅద్ధి ఎలా నడుస్తుంది? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అత్యంత విలువైన భూములను కారుచవకగా కట్టబెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారు అని ఆరోపించారు. రూ.5 వేల కోట్ల విలువ చేసే 54 ఎకరాల ప్రభుత్వ భూములను చంద్రబాబు బంధువు కబ్జాచేస్తున్నారు అని జగన్ ఆరోపించారు. ప్రొ÷–లకెయిన్‌లతో లెవల్ చేసి, ప్రభుత్వం పెట్టిన బోర్డులను పీకేసి ఆక్రమించు కుంటున్నారు అని అన్నారు. ఇంత బహిరంగంగా ఒక ముఖ్యమంత్రి, ఆయన బంధువు, లోక్‌సభ ఎంపీ కలిసి ప్రజల ఆస్తులను దోచేస్తున్నారు అని చెప్పారు. ప్రభుత్వంతోపాటు వ్యవస్థలన్నీ చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను రాబందుల్లా కొల్లగొడుతున్నారు అని ధ్వజమెత్తారు. ఆర్‌బీఐ అడ్వాన్స్‌లమీద ఆధారపడకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో, మినిమం బ్యాలెన్స్ నగదు నిల్వ ఉండే రోజులు పడిపోయాయన్నారు. ఏ కష్టాలు లేనప్పటికీ 2024–25లో నగదు నిల్వలున్న సమయం కేవలం 8 రోజులకు పడిపోయిందన్నారు. 365 రోజుల్లో 357 రోజులు మినిమం బ్యాలెన్స్ కూడా ట్రెజరీల్లో లేవు అని చెప్పారు.

హర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

సమాచారం అందిందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే.. వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా.. మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే.. అది మంచి పరిణామం అన్నారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది.ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు ఇచ్చిన అనుమతి వల్ల పుతిన్ సర్కార్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని శ్వేతసౌధం ప్రకటించింది.

ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. 98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

అమెరికా ఆర్థిక సంస్థలపై దాడుల చేస్తాం!

బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికాకు చెందిన సంస్థలపై దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. ఈ దాడులకు సంబంధించి అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది. ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటిర్, నివిడియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ ఒకరిపై ఒకరు చమురు సంస్థలు, ఆర్థిక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోవడంతో ఇండియా, చైనా వంటి పలు ఆసియా దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా!

ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. చరిత్రలోనే తొలిసారి విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీలను ప్రవేశపెట్టామని.. వినియోగదారులకు బెనిఫిట్ వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ చార్జీలను 39 పైసలు తగ్గిస్తున్నామని.. తద్వారా వినియోగ దారులపై భారం భారీగా తగ్గనుందన్నారు. 6 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని నిర్ణయించామని సీఎం అన్నారు. అయితే ఏడాదిలోనే లక్షా 15 వేల మందిని తయారు చేశామన్నారు. ఈ ఏడాది 5 లక్షల మందిని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎస్టోనియా, ఇజ్రాయిల్, సింగపూర్‌లు ఎంట్రపెన్యూర్‌లను తీసుకువచ్చారని.. ఏపీలో కూడా ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్టు అగ్రిటెక్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా తేవాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలని సీఎం చంద్రబాబు అన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటప్రెన్యూర్ కింద 1.12 లక్షల మంది మహిళా మైక్రో ఎంటప్రెన్యూర్‌లు తయారయ్యారని తెలిపారు. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదామని.. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. సమర్థ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని.. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు గడిచిన రెండు నెలల్లో పెరిగాయన్నారు. మార్చి 1 నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయని వెల్లడించారు. 90 రోజుల పాటు ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ నీటి సంరక్షణా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీల నీళ్ల రిజర్వాయర్లలో ఉన్నాయని సీఎం అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. భూగర్భ జలాలు పెరిగితే ప్రభుత్వం ఇస్తున్న రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సీడీలు భారం తగ్గుతుందన్నారు. వెలిగొండను జూలై నాటికి పూర్తి చేసి నీటిని ఇస్తామని... 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్యం క్రమంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కడా భూ వివాదాలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. పిటిషన్ కల్చర్‌ను తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. వాస్తవాలన్నీ పోర్టల్లో పెడితే వివాదాలు తగ్గుతాయన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలని... అకౌంటబిలిటీ ఫిక్స్ చేయాలని తెలిపారు. భూ వివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, మంత్రులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారం కోసం జన్ సున్వాయ్

13వ తేదీ విశాఖపట్నంతో జన్ సున్వాయ్ కార్యక్రమం మొదటి దశ పూర్తవుతుందన్నారు. ఇప్పటినుంచి ప్రతి జిల్లాలో మహిళా సమస్యలపై జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. మహిళా సమస్యల పరిష్కారమే అజెండాగా వేగవంతంగా, పారదర్శకంగా సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరిస్తామన్నారు. విచారణ అధికారుల పనితీరుపై బాధితులు అసంతృప్తి చెందితే వారి స్థానంలో మరో అధికారిని నియమించాలని జిల్లా ఎస్పీలకు సూచిస్తామన్నారు. జన్ సున్వాయ్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని పెండింగ్ కేసుల విచారణ తో పాటు కొత్త కంప్లైంట్ లు కూడా రావడం ఇందుకు నిదర్శనమన్నారు. మహిళా జన్ సున్వాయ్ లో ఎక్కువగా గృహహింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, మోసపూరిత వివాహాలు, డొమెస్టిక్ వైలెన్స్, వంటి కేసులు ఎక్కువగా మహిళా కమిషన్ దృష్టికి వచ్చాయన్నారు. మహిళా సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలబడి పోరాటం చేయటానికి మహిళా కమిషన్ సిద్ధమన్నారు. న్యాయవాదులను పెట్టుకోలేని వారికోసం న్యాయవాదులను నియమించి వారికి న్యాయ సహాయం కూడా చేస్తామన్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేసే ఏ ఒక్కరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు.ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ పూజిత, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డిపిఓ జ్యోతి, ఏసీపీలు వెంకటేశ్వరరావు, ప్రసాదరావు,దుర్గారావులు పాల్గొన్నారు

సదర్న్ రైల్వే

చెన్నై డివిజన్

భారతదేశ రాష్ట్రపతి తరపున SR.DSTE/I/MAS ఈ క్రింది పనుల కోసం ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

ఈ-టెండర్ నెం	పని పేరు	అంచనా విలువ (రూ.)	పనిని పూర్తి చేసే కాలం
M-SG. 2026-495-Zonal MS Dt. 27.02.2026	చెన్నై డివిజన్‌లో ADSTE/MS పరిధిలో సిగ్నలింగ్ & టెలికాం పనుల కోసం జోనల్ కాంట్రాక్ట్ (2025-26 మరియు 2026-27 రెండు సంవత్సరాల కాలానికి).	2000000.00/-	24 నెలలు
M-SG. 2026-496-Zonal TBM Dt. 27.02.2026	చెన్నై డివిజన్‌లో ADSTE/TBM పరిధిలో సిగ్నలింగ్ & టెలికాం పనుల కోసం జోనల్ కాంట్రాక్ట్ (2025-26 మరియు 2026-27 రెండు సంవత్సరాల కాలానికి).	2000000.00/-	24 నెలలు
M-SG. 2026-497-AJJ-RU_1 Dt. 03.03.2026	చెన్నై డివిజన్‌లో అరకోణం (AJJ) – రేణిగుంట (RU) సెక్షన్‌లో ఐదు ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికమ్యూనికేషన్ పనులు. (AJJ-RU-01/2026)	13455492.36/-	12 నెలలు
M-SG-2026-498-MAS-AJJ_1 Dt. 03.03.2026	చెన్నై డివిజన్‌లో MAS–AJJ సెక్షన్ లో వివిధ ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికమ్యూనికేషన్ పనులు. (MAS-AJJ-01/2026)	8641865.46/-	12 నెలలు
M-SG-2026-499-AJJ-JTJ_1 dated 06.03.2026	చెన్నై డివిజన్‌లో AJJ–JTJ సెక్షన్ లో వివిధ ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికమ్యూనికేషన్ పనులు. (AJJ-JTJ-01/2026)	16376720.16	12 నెలలు
M-SG-2026-500-CGL. AJJ dated 06.03.2026	చెన్నై డివిజన్‌లో CGL–AJJ సెక్షన్ లో వివిధ ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికమ్యూనికేషన్ పనులు.	10555607.49/-	12 నెలలు

టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఈ ఈ-టెండర్ వెబ్‌సైట్‌లో లభిస్తాయి:

HTTPS://WWW.IREPS.GOV.IN

Sr. DFM/MAS.

స్విమ్స్ వైద్య సేవలు భేష్

- చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని

అందుబాటులో సమగ్ర క్యాన్సర్ వైద్యం: స్విమ్స్ సంచాలకులు

తిరుపతి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రపంచ గైనకాలజికల్ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం నారావారిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజికల్ క్యాన్సర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో కనిపించే గర్భాశయ అంతర్గత పొర క్యాన్సర్, అండాశయ, యోని క్యాన్సర్ల గురించి ముందస్తు గుర్తింపు, నివారణ, సమయానికి చికిత్స ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని స్విమ్స్ లోని రేడియేషన్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో, ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ విభాగం, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం మరియు పాథాలజీ విభాగాల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు రూపొందించిన పాంప్లెట్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గైనకాలజికల్ క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని ఆయన తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డా.ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ మహిళలు పాప్ స్మియర్ పరీక్ష ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని, అలాగే HPV వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. మహిళలు పింక్ బస్ ఆరోగ్య సేవలను కూడా వినియోగించుకొని క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. స్విమ్స్‌లో గైనకాలజీ, మెడికల్, సర్జికల్, రేడియేషన్ అంకాలజి విభాగాల ద్వారా క్యాన్సర్ వ్యాధికి సమగ్రమైన వైద్యం అందుబాటులో ఉందని తెలియజేశారు. రెండు పింక్ బస్సుల ద్వారా ఇప్పటివరకు దాదాపు 800 క్యాంపులు నిర్వహించి 42 వేల మందికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టామని వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి ఎన్టీఆర్ వైద్య సేవ, ప్రాణదాన ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నామని వివరించారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కల్పించేందుకు పాలియేటివ్ కేర్ విభాగం ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మహిళలందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అందరం కలిసి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. నారావారిపల్లి సర్పంచ్ శ్రీలక్ష్మి కూడా పాల్గొని మహిళలు ఆరోగ్యంపై మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రేడియేషన్ ఆంకాలజీ ప్రొఫెసర్, నొప్పి, పాలియేటివ్ కేర్ విభాగం ఇన్‌చార్జ్ డా.ప్రాణబంధు దాస్, ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ విభాగాధిపతి డా.ప్రతిభ స్రవంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా.నాగరాజ్, కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శివ సంతోష్, రేడియేషన్ ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. దీప్తి, రేడియేషన్ ఆంకాలజీ సీనియర్ టెక్నాలజిస్ట్ వి.యాదగిరి, అలాగే నారావారిపల్లి జనజ వైద్యులు డా.రవి కుమార్ మరియు డా.స్వర్ణలత పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అంకాలజీ సీనియర్ రెసిడెంట్లు డా.నర్రా భార్గవి, డా.రాజా ఆర్యుగం మరియు డా.హిమశ్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగం పీజీ విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొని గ్రామీణ మహిళలకు గైనకాలజికల్ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, ఎమ్మార్వో శివరాం, డాక్టర్ శివశంకర్, అసిస్టెంట్ డైరెక్టర్(పి.ఆర్) వి.రాజశేఖర్, యం.ఎస్. డబ్ల్యూ ప్రసాద్, నెట్వర్క్ ఇంజనీర్ ప్రణయ్ తేజ, స్థానిక నాయకులు డి.నిరంజన్ నాయుడు, సి.రాజశేఖర్, బి.గిరి నాయుడు, యం.కుమార్ చౌదరి, గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్లు దిలీప్, డాక్టర్ ఆదికృష్ణయ్య సహాయ సహకారాలతో విజయవంతంగా ముగిసింది.

నాయుడుపేట అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే

నాయుడుపేట,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఆర్టీసీ బస్టాండ్ సమీపం అంబేద్కర్ భవన్‌లో జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా.నెలవల విజయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయుడుపేట పట్టణ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ తదితర కీలక అంశాలపై కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో ఆమె సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరిస్తూ, నాయుడుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

నాయుడుపేట, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): స్వాతంత్ర సమరయోధుడు సంఘ సంస్కర్త భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి, వర్ధంతి వేడుకలు గత కొన్నేళ్లుగా రోడ్డుపైనే ఫోటో పెట్టి జరుపుకుంటున్నామని దేశ అభ్యున్నతి, వెనకబడినవర్గాల అభివృద్ధికై కృషిచేసిన మహనీయుడు జగజ్జీవన్ రామ్ అని ఆయన విగ్రహం టౌన్‌లో ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్‌లో ఆయన జన్మదినం ఉందని కావున నాయుడుపేటలో దేశ ప్రయోజనాల కోసం పాటుపడిన అందరి మహనీయుల విగ్రహాలతోపాటు జగజ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కౌన్సిలర్ పాలేటి నాగార్జున తన తోటి కౌన్సిలర్లతో కలిసి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌కు చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు దారా రవి, షబ్బీర్, అశోక్, మణి, సరిత అరుణమ్మ, గోపాలయ్య, విజయమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడుగా నిలిచిన సంఘ సేవకులు యల్లంపాటి

శ్రీకాళహస్తి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పట్టణంలోని భాస్కర్‌పేట, పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామాగ్రిని సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వర బాబు అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 65 మంది విద్యార్థులకు పెన్‌లు, పెన్సిళ్లు, స్కేల్‌లు వంటి పరీక్షలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోటేశ్వర బాబు సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

12న మంత్రి లోకేష్ జువ్వలదిన్నె రాక

- సాగర్ డిఫెన్స్ శంకుస్థాపనను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

కావలి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పట్టణ తెలుగుదేశం పార్టీ యువ నేత, మంత్రి నారా లోకేష్ మార్చి 12వ తేదీ బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు విచ్చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద 29 ఎకరాలలో సాగర్ డిఫెన్స్ ఏర్పాటు చేస్తున్నారని, సాయంత్రం 4 గంటలకు ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుతో కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందబోతున్నదని, మరిన్ని పరిశ్రమలు కూడా రానున్నాయని తెలిపారు. తిప్ప సెంటర్ వద్ద నారా లోకేష్‌కి ఘన స్వాగతం పలుకుతూ ఆహ్వానిద్దామని, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలి

సూళ్లూరుపేట, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో తిరుపతి జిల్లా పిడిఎస్ యూ కార్యదర్శి హెచ్.లోకేష్ పాల్గొన్నారు. లోకేష్ మాట్లాడుతూ, సూళ్లూరుపేటలో గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సూళ్లూరుపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలల ఆవరణ లోనే గంజాయ విక్రయాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ గంజాయి, మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువకులు ఎక్కువగా బానిసలుగా మారుతున్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిడిఎస్యు సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు పి వరప్రసాద్, ఎస్ఎఫ్ఐ సూళ్లూరుపేట నియోజకవర్గం అధ్యక్షులు పి నాగరాజు, ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు జి హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

కందుకూరు,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, చదివిన విషయాలను ఆత్మవిశ్వాసంతో పరీక్షలలో రాయాలని పాఠశాలల ఆర్జేడీ బి. లింగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినీలతో మాట్లాడారు. త్వరలో జరగనున్న టెన్త్ పరీక్షలపై విద్యార్థులు టెన్షన్ పడొద్దని, ధైర్యంగా ఉండి పరీక్షలు రాయాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు చెప్పే సూచనలు, సలహాలు తప్పక పాటించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆర్జేడీ వెంట ఎంఈఓ కె.సుబ్బారెడ్డి, కెజీబీవీ ప్రత్యేకాధికారి స్వాతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

రేణిగుంట,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను పరిశీలించి అక్కడి వైద్య సదుపాయాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వైద్యుల అర్హతలు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానాలను అధికారులు పరిశీలించారు. ముఖ్యంగా ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా లేదా అన్న విషయాన్ని వివరంగా తనిఖీ చేశారు. మొత్తం ఐదు ఆసుపత్రులను తనిఖీ చేసిన అధికారులు, అందులో కొన్ని ఆసుపత్రులు సరైన రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అలాగే బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో కూడా కొన్ని లోపాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఆసుపత్రులను నడపడం అనుమతించబోమని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

తిరుపతి జిల్లా

ముక్కంటి సేవలో శృంగేరి పిఠాధిపతి

శ్రీకాళహస్తి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ మహాస్వామీజీ, శృంగేరి పిఠాదిపతి వారిని కలవడానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి ఆలయంకు విచ్చేసిన శృంగేరి పీఠాధిప తులను ప్రభుత్వం తరఫున మర్యాదపూర్వకంగా భేటీ అయిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శృంగేరి పీఠ శ్రీ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ మహాస్వామీజీ వారి ఆశీస్సులు తీసుకున్న మంత్రి ఆనం. రాష్ట్ర ప్రజలపై శృంగేరి గురువుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరిన మంత్రి ఆనం. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బికే వెంకటేశులు, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, పగడాల మురళి, లక్ష్మమ్మ, సావిత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని అని జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు, జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గోవిందరావు అధ్యక్షతన తిరుపతిలో జిల్లా స్థాయి తనిఖీ కమిటీ అధికారికంగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద రిజిస్టర్ చేయబడిన బాలల సంరక్షణ కేంద్రాలు తనిఖీ చేసి పిల్లల సంక్షేమం, భద్రతను నిర్ధారించే పనిలో ఉన్న ఈ కమిటీ జిల్లా అంతటా ఉన్న పిల్లల సంరక్షణ సంస్థల సమగ్ర తనిఖీలను చేయనున్నారు. పిల్లల ఆరోగ్య, మానసిక, వారికీ ప్రభుత్వ పరంగా అందుతున్న సదుపాయాలు గురించి సమాచారం, జువెనైల్ జస్టిస్ యాక్ట్ ఫారం 46-ఏ చట్టం ప్రకారము సేకరించి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, మహిళా శిశు సంక్షేమ శాఖ, గుంటూరు వారికీ నివేదించటం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యం, భద్రత - క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, సురక్షితమైన జీవన వాతావరణం కలిపించాలి అని తెలిపారు. ప్రతి బాలల సంరక్షణ కేంద్రాలు లలో సిసి కెమేరాలు వర్కింగ్ కండిషన్ లో ఉండేలా చూసుకోవాలి అని తెలిపారు. పిల్లలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి అని తెలిపారు. మరుగుదొడ్ల శుభ్రంగా ఉండే విధంగ చూసుకోవాలి అని తెలిపారు. సంయుక్త కలెక్టర్/అదనపు జిల్లా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ తనిఖీ బృందం నిస్పక్షపాతంగా తనిఖీలు చేసి ఎటువంటి లోపాలు ఉన్న సంబంధిత యజమానులకు తెలియచేసి వారు తప్పనిసరిగా సరిదిద్దు కొనునట్లు తెలియచేయాలని తెలిపారు. నిర్ణిత గడువు లోపల తనిఖీలు పూర్తి అవ్వాలని తెలిపారు. కార్యక్రమములో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిని ఎస్.వసంత బాయి, బాలల సంక్షేమ సమితి సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ సుకన్య(మెడికల్ ఆఫీసర్), డాక్టర్ పి.ఉదయ్ కిరణ్ (సైకియాట్రిస్ట్), జిల్లా బాలల సంక్షేమ అధికారి వి.శివ శంకర్, ప్రొటెక్షన్ ఆఫీస్ కె.కల్పన, తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సత్యవేడు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): సత్యవేడులో టిటిడి కళ్యాణ మండపం, అన్న క్యాంటీన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. బుధవారం ఎమ్మెల్యే సత్యవేడులో పర్యటించి టిటిడి కల్యాణ మండపం, అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కోరిక మేరకు సత్యవేడులో టిటిడి కల్యాణ మండపం నిర్మిస్తున్నందుకు టిటిడి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్ పనులు చివరిదశకు చేరుకుంటుండడం సంతోషంగా ఉందని, మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేస్తే ప్రారంభోత్సవం చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని పేద ప్రజల కోసం చేపడుతున్న ఈ రెండు కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతుండడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తదనంతరం టీడీపీ నేత కాటయ్య తో కలిసి ఎమ్మెల్యే సిరునంబూదూరు లోని నూతన దంపతుల ఇంటికి చేరుకుని కొత్తగా పెళ్లైన జంట చిలక గోరింకల్లా, అష్ట ఐశ్వర్యాలు పొంది, ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దీవించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి: తహసిల్దార్

ములకలచెరువు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ చక్కగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని తహసిల్దార్ ప్రదీప్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు తహసిల్దార్ ప్రదీప్ కుమార్, సతీమణి తేజస్విని పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు పదవ తరగతి పైనే ఆధారపడి ఉందన్నారు. కాబట్టి విద్యార్థులు చక్కగా చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కన్న తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తన వంతు సాయంగా విద్యార్థులకు పరీక్షకిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈద్గా స్థలం కేటాయింపుకు ఎమ్మెల్యే హామీ

ఏర్పేడు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రాంతంలో ఈద్గా కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లిం మసీదు కమిటీ సభ్యులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు బుధవారం రోజున బొజ్జల సుధీర్ రెడ్డిను ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఏర్పేడు చెరువు కలుజు వద్ద ఉన్న ప్రదేశాన్ని ముస్లిం సోదరులు ఈద్గా, శ్మశానంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అయితే ఆ ప్రాంతంలో చెరువు కట్టపై ఒక వైపు మలయాళ స్వామి విగ్రహం, మరోవైపు చర్చి నిర్మాణం ఉండటంతో మత ప్రార్థనలు నిర్వహించేందుకు సరిపడ స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతానికి ఉన్న ప్రదేశాన్ని స్మశానంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా తహసీల్దార్‌తో మాట్లాడి ముస్లిం సోదరులకు మరో అనువైన ప్రదేశంలో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొత్తగా కేటాయించే స్థలంలో ఈద్గా నిర్మించుకుని భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మలయాళ స్వామి విగ్రహం ఏర్పాటు చేసిన ప్రదేశం నుంచి మరింత ఆక్రమణలు జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. మలయాళ స్వామి పేరుతో ఎవరైనా స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొజ్జలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పెద్దపంజాణి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మండలంలోని కత్తార్లపల్లి గ్రామం వద్ద బుధవారం చోటు చేసుకుంది. తమ్మి నాయన పల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు శ్రీధర్ (25), వెంకట ముని కుమారుడు భరత్(20) పుంగునూరులో జరుగుతున్న గంగమ్మ జాతరకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా పుంగునూరు వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న శ్రీధర్, భరత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీధర్ తండ్రి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన కేడీసీ విద్యార్థినులు

కుప్పం, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): కుప్పం డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ బి.సి.ఎ చదువుతున్న కె.అమ్రీన్ తాజ్, బి.బి.ఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.సింధు ఎ.ఐ.సి.టి.ఇ సరస్వతి మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైనట్టు కళాశాల వైస్ చైర్మన్ యం.సాగర్ రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.సుధారాణి అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్ జయశ్రీకి సన్మానం

పలమనేరు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): కృష్ణమ్మగారి జీవనధార ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు క్రిష్ణమ్మ గారి జనార్దన్ ఆధ్వర్యంలో పలమనేరు మండలంలోని జల్లారుపల్లె గ్రామానికి చెందిన జయశ్రీ సివిల్స్ 360 ర్యాంకు సాధించినారు. ఆ విద్యార్థినికి ఫౌండేషన్ తరపున సన్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కోటీశ్వర్, మోహన్, జిల్లేడు అరుణ్, లాయర్ రవి పాల్గొన్నారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సహకరించండి

పెద్దపంజాణి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మండలంలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలకు గ్రామస్థులు సహకరించాలని ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ, ఎంపీడీవో శారదా దేవి తెలిపారు. ముత్తుకూరు, కరసనపల్లి రాజు పల్లి గ్రామ పంచాయతీలలో డిప్యూటీ ఎంపీడీవో, పెద్దపంజాణి, కోగిలేరు, కొలత్తూరు, వీరపల్లి, రాయలపేట నాగిరెడ్డిపల్లి, పెదకాపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పనులను ఎంపీడీవో బాలాజీ బుధవారం తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 16959 హౌస్ హోల్డ్స్ సర్వే చేయడం జరిగింది. 1127 హౌస్ హోల్డ్స్ సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులందరూ ఈ సర్వేలను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బందికి గ్రామస్థులు వారి వివరాలను అందజేసి హౌస్ హోల్డ్ సర్వే పూర్తి చేయటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి కుటుంబానికి పని కల్పించాలి: ఎంపీడీఓ

పెద్దపంజాణి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పనికోరిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని ఎంపీడీఓ బాలాజీ అన్నారు. బుధవారం కొలత్తూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వేతనదారు లతో మాట్లాడుతూ ప్రస్తుతం రోజువారీ వేతనం రూ.307 ఇస్తున్నామని, పనులకు హాజరుగు వేతనదారులకు ఫేస్ ఐడెంటిఫికేషన్ ద్వారా హాజరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా బోగస్ అటెండన్స్ అరికట్టవచ్చనని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్షేత్ర సహాయకులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అసౌకర్యం లేకుండా కాన్వకేషన్ నిర్వహించాలి

కడప, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): గత ఆరు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పీజీ, యూజీ పీహెచ్‌డీ విద్యార్థుల కోసం నిర్వహించబోతున్న యోగి వేమన విశ్వవిద్యాలయం కాన్వకేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాన్వకేషన్ కార్యక్రమం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు తగిన రవాణా సదుపాయం ఏర్పాటు చేయడం, కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజన వసతి కల్పించడం, ప్రస్తుత తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకొని సమృద్ధిగా తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హమీద్, నాయకులు సుబ్బరాయుడు, నవీన్, కళ్యాణ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎంఎస్ఆర్‌లో క్లినికల్ మీటింగ్

చిత్తూరు,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి (డీహెచ్‌హెచ్)లోని లెక్చర్ గ్యాలరీలో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో క్లినికల్ మీటింగ్ నిర్వహించారు. వైద్య విద్యార్థులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్స్, అధ్యాపకుల క్లినికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించడం, తాజా వైద్య పరిశోధనలు, వ్యాధులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు వివిధ వైద్య సమస్యలపై తమ అనుభవాలు, పరిశోధన ఫలితాలు పంచుకొని విద్యార్థులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగం తరపున సీనియర్ రెసిడెంట్ డాక్టర్ బబితా "పారోటిడ్ గ్రంథిలో ఏర్పడే జెయింట్ ప్లియోమార్ఫిక్ అడెనోమా" అంశంపై క్లినికల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు వ్యాధి వ్యాప్తి విధానం, ప్రధాన లక్షణాలు, ప్రమాద కారకాలు మరియు నివారణ చర్యల గురించి ఆయన వివరించారు. సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే స్క్రబ్ టైఫస్‌ను సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమాన్ని క్లినికల్ మీటింగ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రాజేష్ కుమార్ సమన్వయం చేయగా, ఎఐఎంఎస్ఆర్ అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్స్ పెద్ద సంఖ్యలో హాజరై చర్చల్లో పాల్గొన్నారు.

వన్ టైం సెటిల్మెంట్‌ను సద్వినియోగం చేసుకోండి: రెస్కో వీసీ

రామకుప్పం, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): కుప్పం గ్రామీణ విద్యుత్ సంస్థలో వినియోగదారులు ఇదివరకు బకాయిల్లో ఉన్న డబ్బులను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా చెల్లించి అసలుపై ఉన్న వడ్డీని, సర్చార్జీలను రాయితీ పొందాలని రెస్కో వైస్ చైర్మన్ జి విశ్వనాథ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశం ఈనెల 10 నుండి 25 వరకు ఉంటుందన్నారు. ఈ తేదీలలోపు విద్యుత్ బకాయిలు, విద్యుత్ బిల్లులు చెల్లించే వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.

కౌన్సిల్‌లో అజెండా అంశాలకు ఆమోదం

పలమనేరు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పురపాలక సంఘం నందు ఉదయం 11,45 నిమిషాలకు సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నీలం సంజీవరెడ్డి కౌన్సిల్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిల్ అజెండాను చైర్మన్, కౌన్సిల్ సభ్యులు ఆమోదించడమైనది. ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం పూర్తి కావడం వలన కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చాముండేశ్వరితో పాటు కౌన్సిలర్ అందరికి పూల మాలలు వేసి శాలవా కప్పి ఘనంగా సన్మానించినారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, మున్సిపల్ ఏఈ స్నేహప్రియ, ఏఈ శిరీష, టిపిఓ ఇందిరా, మెప్మా బాబా, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ హాస్పిటల్‌ను ప్రారంభించిన వైఎస్ భారతి రెడ్డి

కడప, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన "పల్స్ హాస్పిటల్"ను మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆమెతో పాటు వైఎస్ థామస్ రెడ్డి కూడా ఉన్నారు. ఇందులో భాగంగా ప్రముఖ క్రైస్తవ దైవజనులు పి.మహేష్, మల్లెం విజయ భాస్కర్, అబ్రహం, శామ్యూల్ బాబు, విజయ్ శేఖర్, రవితేజ, రమేష్, డేవిడ్ రాజ్, మాణిక్యం తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యజమాని ,ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏ.వంశీధర్ (కార్డియాల జిస్ట్), డాక్టర్ ఏ.విద్యాధర్ (ఆప్తాల్మాలజిస్ట్)లకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. అత్యాధునిక వసతులతో 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కడప ప్రజలకు అందు బాటులోకి తీసుకురావడం హర్షణీ యమని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేక ప్రా ర్థనలు నిర్వహించి, వైద్య సేవలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

రాయలసీమ రత్నం రాళ్లపల్లి

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

కడప, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): శాస్త్రీయమైన సాహిత్య విమర్శకు కళాత్మకమైన రూపు రేఖలు దిద్దిన ఆధునికాంధ్ర సాహిత్య విమర్శ కుల్లో రాయలసీమ రత్నంగా పేర్కొనదగిన వ్యక్తి రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ అని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ 47వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ సంప్రదాయ పాండిత్యంలో, ఆధునిక సాహిత్య విమర్శలో గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదిం చుకున్నారని, స్వతంత్ర సాహిత్య విమర్శకు దారి చూపింది కట్టమంచి రామలింగారెడ్డి అయినా దాన్ని గమ్యం చేర్చింది మాత్రం రాళ్లపల్లి అన్నారు. కార్యక్రమంలో వెల్లాల వెంకటేశ్వరాచారి, ఎం మురళి, డి గంగయ్య, డి సుధాకర్, వి ప్రకాష్, ఎం సత్యనా రాయణ, ఏ పవన్ కుమార్, ఎం చెన్నయ్య, ఎన్ వీరన్న, ఎంవెంకట సుబ్బయ్య, ఎన్ ప్రకాష్ శర్మ, బాల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మదకశిర, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు పెట్టుకున్న లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఆరోగ్య సమస్య పట్ల ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న ఆసుపత్రి బిల్లులను సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు పెట్టుకున్న 38 మందికి రూ.17 లక్షల 35 వేలు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ సకాలంలో ఆసుపత్రి బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు పెట్టుకున్న మాకు చెక్కులు వచ్చేటట్లు చేసినటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి యువ నాయకులు నారా లోకేష్ బాబుకి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆసుపత్రికి డబ్బులు పెట్టుకొని చితికిపోయిన ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబాలకు చెక్కులు రావడం వల్ల మా కుటుంబాలు ఆర్థిక సమస్యల నుండి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి రాష్ట్ర కుంచిటిగా ఒకలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్ని మండల కన్వీనర్లు సింగల్ విండో అధ్యక్షులు అన్ని అనుబంధ కమిటీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా

శ్రీతిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పలమనేరు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మున్సిపల్ పరిధిలోని గంటావూరు బీసీకాలనీ నందు వెలసిన శ్రీతిరుపతి గంగమ్మకు సోమవారం దేవాలయం చైర్మన్, డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయంలో ఉదయం అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయ ధర్మకర్త, ఆలయ చైర్మన్ సేవారత్న స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే సాయంత్రం 4 గంటలకు వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ స్టేట్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్.రాజన్ ఆలయం వద్దకు రాగానే అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు చైర్మన్ ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం జ్వాలాదీప ప్రజ్వలన, అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు అమ్మవారిని దర్శనం దర్శించుకోవడం జరిగింది. ఈసందర్భంగా వేలాదిమంది భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం టిడిపి నాయకులకు ఆలయ చైర్మన్ డాక్టర్ మురుగన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఏప్రిల్ నుంచి 'వికసిత్ భారత్ జిరామ్ జీ' అమలు

రామసముద్రం,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మండలంలోని కాపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పథక సంచాలకులు వెంకటరత్నం బుధవారం పరిశీలించారు. మామిడి చెట్లకు తవ్విన పాదులు, సీసీ రోడ్డు, గోకులం షెడ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొత్త రూపంలో "వికసిత్ భారత్ జిరామ్ జీ" పథకంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఏపీవో మాధవి, సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఏపీవో మాధవి ఆధ్వర్యంలో సిబ్బందికి పథకం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పథకం ద్వారా 125 రోజుల ఉపాధి హామీతో పాటు నీటి భద్రత, రైతులకు మేలు చేసే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాల గదుల నిర్మాణం, రహదారుల అనుసంధానం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. గతంలో ఉన్న 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచడం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

నూతన ఆవిష్కరణలలో ప్రతిభ చూపితేనే విద్యార్థులకు భవిష్యత్తు

- మిట్స్ యూనివర్సిటీలో ఉత్సాహంగా సాగిన ఐడియాతాన్

మదనపల్లె/ కురబలకోట, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తిరుపతి వారు సంయుక్తంగా ఐడియాతాన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ హెచ్.ఆర్.పి.సిల్వియా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి మేధస్సును దేశం మరియు సమాజ అభివృద్ధికి ఉపయోగపడేలా చేయడం రతన్ టాటా ఇన్నోవేషన్ సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రస్తుతం డేటా ఇంజనీరింగ్, నైతిక ఏఐ మరియు రియల్-టైమ్ అనలిటిక్స్ వంటి రంగాలపై దృష్టి సారించి, నైపుణ్యం కలిగిన డేటా సైన్స్ నిపుణులకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. సంస్థలు ఇప్పుడు పైథాన్, ఎస్.క్యూ.ఎల్, టేబుల్యు వంటి సాధనాలలో సాంకేతిక నైపుణ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా బలమైన సమస్య పరిష్కారం, డొమైన్-నిర్దిష్ట జ్ఞానాన్ని కలిగి ఉన్న ప్రతిభను కోరుకుంటున్నాయన్నారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ నేటి యువతకు రతన్ టాటా ఒక గొప్ప ఆదర్శమని, కొత్తదనం, నాణ్యత మరియు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ఉత్పత్తులను రూపొందించడం ఆయన ప్రత్యేకత అని, ముఖ్యంగా టాటా నానో వంటి ఆవిష్కరణలు యువతకు స్ఫూర్తినిస్తాయన్నారు.ప్రతి రంగంలోనూ కొత్త ఆలోచనలు,నాణ్యమైన ఉత్పత్తులు,సరైన మార్కెటింగ్ మరియు దీర్ఘకాలిక మన్నిక వంటి అంశాలు విజయానికి కీలకమని తెలిపారు. ఈ హ్యాకథానులో విద్యార్థులు, స్టార్టప్స్, టెక్నాలజీకి సంబంధిచిన తమ సృజనాత్మకతను, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాన్ని పొందారన్నారు. ముఖ్యంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎం.ఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి), సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై చర్చలు, ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. నేటి యువత నూతన ఆవిష్కరణలలో తమ ప్రతిభను చూపితేనే భవిష్యత్తులో ముందుకు వెళ్లే అవకాశాలు ఏర్పడతాయన్నారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు.ఇందులో భాగంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీన్ స్కూల్ అఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా, విభాగాధిపతి డాక్టర్ ఎస్ కుసుమ, కన్వీనర్ డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది కోసం మెగా వైద్య శిబిరం

అనంతపురం,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారిచే పోలీసు కాన్ఫరెన్స్ హాలులో క్యాన్సర్ నిర్ధారణ, ఇతర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ప్రాణాంతకం కాదని వెల్లడించారు. క్యాన్సర్ రాకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన చాలా ముఖ్యం... అనుమానం వస్తే డాక్టర్లను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం.. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ కేన్సర్, లంగ్ కేన్సర్‌లపై అవగాహన చేశారు. వయస్సు వల్ల, జన్యుపరంగా లేదా అలవాట్ల వల్ల వచ్చే క్యాన్సర్లు రాకుండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలిచ్చారు. వస్తే త్వరగా డిటెక్ట్ చేయడానికి సంబంధిత డాక్టర్లను సంప్రదించి టెస్టులు చేయించుకోవడం తదనుగుణంగా చికిత్స తీసుకోవాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ ఛేర్మన్ ఉ నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు గౌస్ మహమ్మద్దీన్, హైదరాబాద్ బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ గైనకాలజిస్టులు జ్యోతి, మాన్విత, జనరల్ ఫిజీషియన్ రవిశంకర్, రేడియాలజిస్ట్ ప్రభాకర్, మేనేజర్ లక్ష్మణ్... సి.ఐలు ధరణికిశోర్, క్రాంతికుమార్, ఆర్ఐలు పవన్ కుమార్, మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమీటి సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, సరోజ, పోలీసులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు నెలవు 'విజయభారతి'

- పాఠశాల వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): క్రమ శిక్షణ, నాణ్యమైన విద్యాబో ధనకు పట్టణంలోని సొసైటీ కాలనీ నందు గల విజయ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నెలవని, ప్రతి ఏడాది పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శన మని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక విజయభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నందు చైర్మన్ డాక్టర్ ఎన్.సేతు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నిశ్చిత సేతు పర్యవేక్షణలో జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడంతోపాటు, వారి జీవితాల్లో ఏప్పటికి మరచి పోని విధంగా కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలోవారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పదవ తరగతిలో మంచి పలితాలు సాధించే విధంగా విద్యార్థులను ప్రోత్సహి స్తూ సన్నద్ధం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తో పాటు మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహ రెడ్డి, డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, ప్రిన్సిపాల్ నిశ్చిత సేతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలాదిమంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన గొప్ప విద్యావేత్త సేతు అని ప్రశంసించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు దేశభక్తి,క్రీడలు, సంగీతం,కరాటే వంటి అంశాలలో శిక్షణ ఇస్తూ రాష్ట్రస్థాయి లోనే పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. సేవా కార్యక్రమాలలోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారని, ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో విజయ భారతి పాఠశాల రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో విలువలుతో కూడిన విద్యాబ్యాసం అందిస్తూ,వారిని ఉత్తమ ఫలితాలతో ప్రయోజకులుగా మార్చడంలో విజయ భారతి విద్యాసంస్థ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. త్వరలో జరుగబోవు పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో విజయభారతి విద్యాసంస్థను నిలబెట్టాలని ఆకాంక్షిం చారు. విద్యార్థులు పరీక్షలను ఒత్తిడికి దూరంగా, ప్రశాంతంగా పరీక్షలు రాయా లన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చరిత్ర చాలా గొప్పదని కితాబునిచ్చారు. అనంతరం డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులందరు చక్కగా పరీక్షలు రాయడానికి మానసికంగా సిద్ధం కావాలని, చక్కగా చదువుకొని, ఒత్తికిలోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో పాఠశాలకు ఉపాధ్యా యులకు గౌరవం గుర్తింపు తీసుకురావా లని సూచించారు. అనంతరం వాయిస్ ఆఫ్ ద పీపుల్‌గా గుర్తింపు పొందిన జింక చలపతి జన్మదిన వేడుకలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా

డి.ఎస్.టి.బి కేసుల వాలిడేషన్ కోసం డబ్ల్యు.హెచ్.ఓ కన్సల్టెంట్ విజిట్

వాల్మీకిపురం, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా డి.ఎస్.టి.బి టీబీ కేసుల వాలిడేషన్ కోసం డబ్ల్యు.హెచ్.ఓ కన్సల్టెంట్ డా. నితీష్ రామ్ కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం, స్థానిక మండలంలోని మెడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం పర్యటిం చారు. ఈ సందర్భంగా గుర్తించిన టి.బి పేషెంట్లను వారి ఇళ్ల వద్దకు వెళ్లి హోమ్ విజిట్ నిర్వహించారు. పేషెంట్లు తీసుకుంటున్న చికిత్స విధానం, ఔషధాలను సక్రమంగా వాడుతున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. అలాగే నిక్షయ్ పోషణ పథకం ద్వారా ప్రతి నెల రూ.1000 జమ అవుతున్నాయా లేదా, పోషణ కిట్ అందుతున్నదా అనే విషయాలపై కూడా తెలుసుకున్నారు. అదేవిధంగా పేషెంట్లు పూర్తి స్థాయి చికిత్స తీసుకోవాల్సిన అవసరం, పోషకాహారం తీసుకోవడం, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాల్మీకిపురం టిబి యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ నాగిరెడ్డి, సంబంధిత వైద్య సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కె.వి.పల్లి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అన్నమయ్య జిల్లాలోని కె.వి.పల్లి మండలం గ్యారంపల్లి గ్రామంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలురు)లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్, ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్జేసీ-డీసీ సెట్-2026 పరీక్ష సమన్వయకర్త డాక్టర్ ఎం.రామకృష్ణాంజనేయులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రవేశాలలో ఐదవ తరగతిలోని అన్ని సీట్లకు, అలాగే 6వ, 7వ, 8వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో ఎం.పి.సి (60), బి.పి.సి (40), ఎం.ఈ.సి (30) గ్రూపుల్లో కూడా ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 31వ తేదీ లోపు అధికారిక వెబ్‌సైట్ http://apgs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఏప్రిల్ 24న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ గురుకుల విద్యాసంస్థల్లో ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ ప్రమాణాలతో విద్యాబోధన అందించబడుతుంది. అలాగే విద్యార్థులకు పౌష్టికాహారం, వసతి వంటి సదుపాయాలు పూర్తిగా ఉచితంగా కల్పించబడతాయని అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712625051, 8712625076 సంప్రదించవచ్చని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఏపీఆర్జేసీలో ప్రవేశాలకు, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఏపీఆర్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దేశభక్తి, సేవా భావానికి ప్రతీక స్కౌట్

- యూనిట్ లీడర్ల సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్ అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని హోప్ మున్సిపల్ హై స్కూల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. స్కౌట్ లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా నడుచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నిజజీవితంలో విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. హార్సిలీహిల్స్ లోని స్కౌట్ ప్రాంతీయ శిక్షణ కేంద్ర మరమ్మతులకు రూ.50 వేలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మరొక ముఖ్య అతిథి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అన్నిరకాల ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరి అని అన్నారు. స్కౌట్ నందు చేరి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో స్కౌట్ ఉద్యమాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడం జరుగుతూ ఉందన్నారు. అనంతరం ఇటీవలే బేసిక్ మరియు అడ్వాన్స్ శిక్షణ పూర్తి చేసుకున్న స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏ.ఎల్.టి లక్ష్మీకర్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆపదమిత్ర కో-ఆర్డినేటర్ గురునాథరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు సిద్ధారెడ్డి, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ ఈశ్వరయ్య, మహమ్మద్ ఖాన్, హర్షవర్ధన్ రెడ్డి, లక్ష్మీపతి, విద్యాధరరావు, మధుకర్ రెడ్డి, గైడ్ కెప్టెన్లు రమా భార్గవి, షమభాను, గీత, స్కౌట్ మాస్టర్లు గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

నరేన్ దాస్ మోర్ బాయ్ బుద్రాని ట్రస్టు రూ.5 కోట్లు విరాళం

- కడప ఏల్‌వి ప్రసాద్(ఐ) ఇన్‌స్టిట్యూట్ సందర్శన

- ట్రస్ట్ సేవలను ప్రసంసించిన డా.ఎన్ ముని గోపాల కృష్ణ

మదనపల్లె, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మహారాష్ట్ర స్టేట్ ప్రకాష్ నారాయణ్ బోర్ గావ్ కర్ నరేన్ దాస్ మోర్ బాయ్ బుద్రాని ట్రస్ట్ సిఈఓ ఆధ్వర్యంలో ట్రస్టు తరపున రూ.5 కోట్లు విరాళం ఇచ్చి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాలలో సేవలను అందిస్తున్నారు. కడపలోని ఏల్‌వి ప్రసాద్(ఐ) ఇన్స్టిట్యూట్‌కు వచ్చి అడ్మిన్ విజయ్ కుమార్ ద్వారా క్యాన్సర్ రోగులకు కౌన్సిలింగ్, కౌన్సిలింగ్ ఫర్ చిల్డ్రన్ వాల్యూ ఎడ్యుకేషన్, కౌన్సిలింగ్ ఫర్ పేరెంట్స్ అండ్ చిల్డ్రన్, క్యాన్సర్ రోగులకు ఆర్థిక సహాయం, మిడ్డే మీల్స్ ఫర్ చిల్డ్రన్, హార్ట్ ఆపరేషన్ చిల్డ్రన్స్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి హెల్పజ్ ఇండియా అండ్ డైరెక్టర్ మొహమ్మద్ రజా సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎన్.ముని గోపాల కృష్ణ, మీడియా ఇంజనీర్ కరుణాకర్, ప్రఖ్యాత బోన్ స్పెషలిస్ట్ డా.రామచంద్రయ్యలు సీఈఓ నారాయణ్‌ను కలిసి ట్రస్ట్ తరపున వారు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ముని గోపాల కృష్ణకు సీఈఓ ప్రకాష్ నారాయణ్ అన్ని విషయాలు తెలియ జేస్తు 2024-25 వార్షిక నివేదిక వివరాలు అందజేశారు. నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో జరిగే కార్య క్రమాలను వివరించారు. ట్రస్ట్ సేవలను వివరించారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యలో ప్రవేశం పొందేందుకు నిర్వహించబడే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)- 2026కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రొద్దుటూరు ప్రిన్సిపాల్ పాలెం గురుమూర్తి రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పూర్తయ్యిన అనంతరం ఏప్రిల్ 1 నుండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రొద్దుటూరులో పాలిసెట్-2026కు ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. వివరాలకు విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. వివరాలకు 9502078159/ 9912342022 సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల పక్షపాతి పలిశెట్టి దామోదర్ రావు

- ఆర్టీసీ 1, 2 డిపోల ఈయు గౌరవాధ్యక్షులు నాగూర్ వలి ప్రశంసలు

మదనపల్లె, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదర్ రావు ఆర్టీసీ కార్మికుల పక్షపాతి అని ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి(షో ఆప్ శీనా) ప్రశంసించారు. బుధవారం దామోదర్ రావు జన్మదిన వేడుకలు మదనపల్లి 1,2 డిపోల వద్ద ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు సీఏ బాబు, మదనపల్లె వన్ డిపో జాయింట్ సెక్రటరీ బి.మధు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లె వన్ అండ్ టు డిపోల గౌరవాధ్యక్షులు నాగూర్ వలి మరియు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.వి కుమార్ హాజరయ్యారు. ఇందులో భాగంగా ఆర్టీసీ కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి దామోదర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఈ వేడుకలకు హాజరైన సిబ్బందికి ఎంప్లాయిస్ యూనియన్ లోగోతో రూపొందించిన కీచైన్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాగూర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కోసం దామోదర్ రావు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, కార్మికుల డిమాండ్ల సాధనకై ఆయన అలుపెరుగని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన సారథ్యంలో ఎంప్లాయిస్ యూనియన్ మరింత బలంగా రూపుదిద్దుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి పరితపించే దామోదర్ రావు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్ ఆలీ, మదనపల్లె టూ డిపో సెక్రటరీ పూల శ్రీనివాసులు, ఏడిసి బేగ్,ఏడి సివీఆర్ మూర్తి, డి.నాగేంద్ర, నాగేశ్వర, చరణ్ సింగ్, ఎల్లప్ప, హుస్సేన్, రాజశేఖర్లతోపాటు దాదాపు 60 మందిపైగా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌చే సివిల్స్ ర్యాంకర్ రాజశేఖర్‌కు ఘన సన్మానం

మదనపల్లె,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మదనపల్లె లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సివిల్స్‌లో ర్యాంకర్‌గా నిలిచిన రాజ శేఖర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక సొసైటీ కాలనీలో గల లయన్స్ కంటి ఆసుపత్రి నందు ఈ నెల 6న విడుదలైన యూపిఎస్‌సి సివిల్స్ నందు జాతీయ స్థాయిలో 920 ర్యాంక్ సాధించిన రాజశేఖర్‌ను ప్రసంసిస్తూ ఆయన సతీమణి రజితతో కలిపి దుశ్శాలువ, జ్ఞాపిక లతో సన్మానించారు. రాజశేఖర్ మాట్లాడుతూ తాను పుట్టిన కొంత కాలానికె తల్లిదండ్రుల మరణిస్తే, పేదరికంలో వున్న అక్క అన్నీ తానై తాను చదువు కోవడానికి సహకారం అందించారని, అ దీన స్థితిలో తాను కన్న కలలను నిజం చేసుకోవడానికి మదనపల్లె లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి చైర్మన్ బోడిపాటి భాస్కర్ నాయుడు అందించిన సహాయ సహకారాలతో విద్యను పూర్తి చేసి సివిల్స్‌లో ర్యాంక్ సాధించడానికి వీలు కలిగిం దన్నారు. వారి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బోడి పాటి భాస్కర్ నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేక పోవడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన రాజశేఖర్ ఆశయాన్ని గుర్తించి, ఐఐటి ప్రవేశ పరీక్ష రాయించి, ర్యాంక్ రావడంతో భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ చదివించారు. అందులో కూడా మంచి ప్రతిభను కనబర్చడంతో డిల్లీలో సివిల్స్ ప్రిపేర్ కావడానికి తాను వెన్ను తట్టి ప్రోత్సహించడం జరిగిందన్నారు. అయితే తమ ఆశలను వమ్ము చేయకుండా నిజం చేసిన రాజశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిఆర్ఓ గౌతమ్ రెడ్డి, డాక్టర్ నివేదిత, మనోజ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల రూపకల్పనపై విద్యార్థులకు అవగాహన

- విశ్వం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.డి.రమణారెడ్డి వెల్లడి

'సివిల్' విద్యార్థులకు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్‌పై వర్క్ షాప్ విజయవంతం

మదనపల్లె/ కురబలకోట,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): విశ్వం ఇంజనీరింగ్ కళాశాల లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులకు "స్మార్ట్ స్ట్రక్చర్స్: బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడల్ ఇంప్లిమెంటేషన్" అంశంపై వారం రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ డా.డి.రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల రెండవ తేదీ మొదలైన ఈ వర్క్ షాప్ ఏడవ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, సస్టైనబుల్ మౌలిక వసతుల రూపకల్పనపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. నిర్మాణ ప్రణాళిక, డిజైన్, నిర్వహణలో (బిఐఎం) సాంకేతికతల వినియోగంపై ప్రత్యేకంగా విద్యార్థులకు వివరించి చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమానికి సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు డా.ఎన్.శివకుమార్ వనరుల వ్యక్తిగా హాజరై స్మార్ట్ నిర్మాణ విధానాలు, డిజిటల్ మోడలింగ్ పద్ధతులు, ఆధునిక నిర్మాణ రంగంలో(బిఐఎం) ప్రాధాన్యతపై సవివరంగా వివరించారన్నారు. ఆయన నిర్వహించిన సాంకేతిక ఉపన్యాసాలు, ప్రదర్శనల ద్వారా విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందారని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.టి.ఎస్.ఘోస్ బాషా హాజరై విద్యార్థులు ఇటువంటి సాంకేతిక కార్యక్రమాలలో పాల్గొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.ఎస్.రీహానా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సస్టైనబుల్ నిర్మాణ విధానాల కోసం(బిఐఎం) వంటి ఆధునిక సాంకేతికతలపై అవగాహన ఎంతో అవసరమని సూచించారు. సాంకేతిక ఉపన్యాసాలు, ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్లు, ఇంటరాక్టివ్ సెషన్లతో ఈ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు పాల్గొని సహకరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిపుణుల మార్గదర్శకత్వాన్ని పొందారు.

ఈ నెల 18 నుండి శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు

- కరపత్రాలను ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): నీరుగట్టువారిపల్లి సిల్క్ టౌన్ నందు వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవ కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. బుధవారం శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం నందు జరిగిన కార్యక్రమానికి కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్,కార్యదర్శి బండి పవన్ కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య,గౌరవ అధ్యక్షులు మోడెం వెంకటరమణ, గౌరవ ఉపాధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,మోడెం సిద్ధప్ప, రామిశెట్టి నీలకంఠ, ఉప్పు రామచంద్ర, బి.నాగరాజు, ఆర్.కె.మోహన, జి.లక్ష్మీ నారాయణ, కొరముట్ల నాగరాజు మరియు ప్రభాకర్ శివయ్య, ఉప్పు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేది బుధవారం నుండి 21వ తేది శనివారం వరకు అత్యంత వైభవంగా జ్యోతి ఉత్సవాలు జరుగుతాయని ప్రకరించారు. ఈ వేడుకల్లో భక్తాదులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులై ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు పొందాలని ఆకాంక్షించారు.

బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్

కడప,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): బిజెపి కడప జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎం.చంద్రశేఖర్ నియమితు లయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, కడప జిల్లా బిజెపి అధ్యక్షులు జంగిటి వెంకటసు బ్బారెడ్డి, ఎస్సీ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు పుట్టిక వెంకటరమణ లకు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు.అలాగే ఆంధ్రప్రదేశ్ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్ మాచునూరు హరికృష్ణ, ఓబు లేసు, జిల్లా, రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బిజెపి బలోపే తానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

బంగారు, నగదు చోరీ

ములకలచెరువు, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు చోరీ జరిగిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకొంది. బాధితుడి సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం, ములకలచెరువు మండలం, కదిరినాథుని కోట పంచాయితీ బేగంవారిపల్లి చెందిన విశ్వనాథ్ గత కొన్ని ఏళ్లుగా మండల కేంద్రంలోని నాయిని చెరువు పల్లి రోడ్డు, వినాయక నగర్‌లో భార్య బిడ్డలతో నివాసం ఉంటున్నాడు. ఈనెల 10వ తేదీ మంగళవారం సాయంకాలం ఇంటికి తాళాలు వేసి మద్దినాయని పల్లి గ్రామం, గుట్టకింద పల్లెలో గల బంధువుల ఇంటికి పండుగకు వెళ్లారు. తిరిగి 11వ తేదీ ఉదయం బుధవారం ఇంటికి రావడంతో ఇంటి కాలం పగలగొట్టి తలుపు తెరిచి ఉండడంతో ఇంటిలోకి వెళ్లి చూశారు. బీరువా పగలగొట్టి అందులో ఉన్న 8 గ్రాముల బంగారు నగలు, రూ.70 వేలు నగదు దొంగలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రతాప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం

సిఎం రేవంత్ తదితరుల హాజరు

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం దారుణం

- లోక్‌సభలో లేవనెత్తుతాం: సురేశ్ రెడ్డి

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి వెల్లడించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని అపహాస్యం చేసినట్టేనని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మార్పులు కావాలని కాంగ్రెస్ కేంద్ర నాయకులు, రాహుల్ గాంధీ మాట్లాడుతున్నా, తెలంగాణలో దీనికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మళ్లీ ఇంకో పార్టీ నుంచి పోటీ చేసిన విషయం స్పష్టంగా రుజువులున్నా కూడా స్పీకర్ ఇచ్చిన తీర్పు నవ్వుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తీర్పులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు. కేసీఆర్ తమకు ఇచ్చిన ఆదేశాలన్నింటినీ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నామని, పార్టీ ఫిరాయింపులపై కూడా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. స్పీకర్ తీర్పుపై అన్ని అవకాశాలను ఉపయోగించి, జ్యుడిషియల్ రివ్యూకు వెళ్తామని స్పష్టం చేశారు.

అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ!

- 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్ - రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం

- సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్,మార్చి11(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టును అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందంగా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్టు దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు

ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన, అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసంపై చర్చ

-విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకున్నారన్న రాహుల్

-స్పీకర్‌ను అవమానించినా భరించారన్న రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత మాట్లాడకుండా స్పీకర్ ఓం బిర్లా అనేక సార్లు అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ చర్చ ప్రజాస్వామ్యం అన్నారు. పదే పదే స్పీకర్ ఓం బిర్లా తనను మాట్లాడకుండా అడ్డుకున్నారని.. లోక్‌సభ అనేది దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించలేదని రాహుల్ గాంధీ అనగానే బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కలుగజేసుకుని.. ఎప్పుడూ? ఎప్పుడూ ఎప్పుడూ అని అడిగారు. ప్రధాని మోదీ, స్పీకర్ కుర్చీని విపక్ష సభ్యులు చాలాసార్లు చుట్టుముట్టారని, కాగితాలు విసిరారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కానీ స్పీకర్ ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నారని పేర్కొన్నారు. స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలనే తీర్మానంపై లోక్‌సభలో చర్చ సాగుతోంది. రవిశంకర్ ప్రసాద్ బుధవారం చర్చను ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల్లో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు రావడం ఇది రెండోసారి మాత్రమే అని అన్నారు. 'స్పీకర్ వైఖరి, అవిశ్వాసాన్ని సాధనంగా ఉపయోగించకూడదు. డాక్టర్ అంబేద్కర్‌ను ఉటంకిస్తూ స్పీకర్‌కు గౌరవం ఉందని.. సభకు జవాబుదారీగా ఉంటారు. ఈ సభ అనేక ఒడిదుడుకులను చూసింది. ప్రతిసారీ పార్లమెంటు కొత్త ఎత్తులకు చేరుకుంది. ఈ సభలోనే 11 మంది ఎంపీలు బహిష్కరించబడ్డారు. అత్యవసర పరిస్థితి విధించబడిన బాధాకరమైన క్షణం కూడా ఉంది. ఈ సభ తన ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని ఆరు సంవత్సరాలకు పొడిగించింది. నిన్న అక్కడి నుంచే హక్కుల గురించి చాలా చర్చ జరిగింది. వాజ్‌పేయి, అద్వానీ, మధు దండవతే లేదా చంద్రశేఖర్ అందరూ జైలులో ఉన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను వ్యతిరేకించి వాటిని అధిగమించిన

ధైర్యవంతుడైన న్యాయమూర్తి హెచ్ ఆర్ ఖన్నా ఉన్నాడని వారు చాలా బాధపడ్డారు. జయప్రకాష్ నారాయణ్ మూత్రపిండాల వైఫల్యంతో ముంబైలోని జాస్లోక్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు సూర్యరశ్మి చేయాలని సూచించారు. దీని కోసం ఆయన హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాతే ఆయనను గంటసేపు ఎండలో కూర్చోవడానికి అనుమతించారని రవిశంకర్ ప్రసాద్ గుర్తుచేశారు.

ఐపిఎల్ తొలి షెడ్యూల్ విడుదల

- 28న బెంగుళూరుతో తొలి మ్యాచ్

ముంబై,మార్చి11(ఆర్ఎన్ఎ): క్రికెట్ అభిమానులు ఎప్పుడా అని ఎదురుచూస్తోన్న ఐపీఎల్ 2026 అధికారిక షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 28 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. పలు రాష్ట్రాల్లో ఎన్నికల దృష్ట్యా షెడ్యూల్ విడుదల కాస్త ఆలస్యమైంది. కాగా ఎన్నడూ లేని విధంగా సరికొత్తగా ఈ సీజన్‌కు తెరలేవనుంది. ఈసారి రెండు దశల్లో ఈ టోర్నీని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి 20 మ్యాచ్‌లకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేశారు. ఏప్రిల్ 12 వరకు ఇవి కొనసాగనున్నాయి. తొలి మ్యాచులో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ తలపడనున్నాయి. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. 29న ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్; 30న రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్; 31న పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్; ఏప్రిల్ 1న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, దిల్లీ క్యాపిటల్స్ తలపడనున్నాయి. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత పూర్తి షెడ్యూల్ విడుదల చేస్తారని సమాచారం.

ధోనీ ఈ సీజన్ అంతా ఆడుతాడు

- సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ ప్రకటన

చెన్నై,మార్చి11(ఆర్ఎన్ఎ): ఐపీఎల్ 2026 సందడి మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే స్టార్ ప్లేయర్లంతా సన్నద్ధ మవుతున్నారు. అయితే ఐపీఎల్ అనగానే అభిమానుల్లో మెదిలేది ఒక్కటే ప్రశ్న.. క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీపైనే ఈసారి కూడా అందరి దృష్టి ఉంది. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ ఓ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సీజన్‌లో ధోనీ ఆడనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. 'ఎంఎస్ ధోనీ ఈ సీజన్‌లోనూ ఆడతాడు. అన్ని మ్యాచుల్లోనూ బరిలోకి దిగుతాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వినియోగిస్తారా? అంటే దాని గురించి నేనేం మాట్లాడలేను. అది క్రికెట్‌కు సంబంధించిన నిర్ణయం. స్టాఫ్ ఈ నిర్ణయం తీసుకుంటారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ తీసుకునేది కాదు. బ్యాటర్‌గా ఆడతాడా? వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గానా? ఇంపాక్ట్ ప్లేయర్‌గానా? అనేది వారు డిసైడ్ చేస్తారు' అని స్పష్టం చేశారు. 'టీమిండియా వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గడం సంతోషంగా ఉంది. అందులో సీఎస్కే ప్లేయర్లు సంజు శాంసన్, శివమ్ దూబే అద్భుతంగా ఆడారు. వారి స్ఫూర్తితో ఐపీఎల్‌లో సీఎస్కే ఆటగాళ్లు ఉత్తమ ప్రదర్శన చేస్తారని భావిస్తున్నా. ఇక మా మ్యాచులన్నింటినీ చెన్నై వేదికగా ఆడతాం. తమిళనాడు ఎన్నికల

నేపథ్యంలో.. ఆటగాళ్ల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. పూర్తి స్థాయి షెడ్యూల్ కోసం మేమూ వేచి చూస్తున్నాం' అని తెలిపారు.

ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ ప్రకటన

- బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ సత్తా

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): టీ20 ప్రపంచ కప్ 2026ను టీమిండియా ఘనంగా ముగించింది. వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ప్రకటించింది. ఇందులో భారత బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ సత్తా చాటారు. అభిషేక్ శర్మ తన స్థానాన్ని పదిలపర్చుకుని అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. కాగా టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనలు చేసిన ఇషాన్ కిషన్ రెండోస్థానానికి దూసుకొచ్చాడు. టీ20 ప్రపంచ కప్‌లో అభిషేక్ శర్మ ఆరంభంలో ఫామ్ లేమితో తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అతడి ప్రదర్శనతో టీ20 ర్యాంకింగ్స్‌లో అతడి స్థానాన్ని కోల్పోవచ్చనే చర్చ కూడా జరిగింది. ఎట్టకేలకు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి అదరగొట్టాడు. దీంతో అతడి స్థానంలో పదిలం అయింది. 875 పాయింట్లతో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు గత రెండేళ్లు జట్టులోనే లేని ఇషాన్ కిషన్.. దేశవాళీలో సత్తా చాటి తుది జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. అద్భుత ప్రదర్శనలతో ఔరా అనిపించాడు. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 871 పాయింట్లతో రెండోస్థానంలోకి దూసుకొచ్చాడు. 742 పాయింట్లతో తిలక్ వర్మ ఏడో స్థానంలో ఉండగా.. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(722) తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన స్థానాన్ని కోల్పోయాడు. పొట్టి ప్రపంచ కప్ టోర్నీలో వికెట్లు తీసినప్పటికీ ధారాళంగా పరుగులు సమర్పించుకున్న సంగతి తెలిసిందే. దీంతో అఎ÷-గానిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ 753 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. కాగా వరుణ్ చక్రవర్తి 740 పాయింట్లతో రెండోస్థానానికి పడిపోయాడు. స్టార్ పేసర్ బుమ్రా 702 పాయింట్లతో ఆరో స్థానానికి ఎగబాకాడు. ఐసీసీ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్ జాబితాలో తొలి స్థానంలో సికందర్

రజా(328), రెండో స్థానంలో హార్దిక్ పాండ్య(299), మూడో స్థానంలో సయామ్ ఆయూబ్(275) ఉన్నారు. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్(201) తొమ్మిదో స్థానానికి ఎగబాకాడు.

వరుసగా రెండు విజయాలు

- సమిష్టి కృషితో రాణించిన టీమిండియా జట్టు

ముంబై,మార్చి11(ఆర్ఎన్ఎ) : కేవలం 2 ఏళ్ల వ్యవధిలో కప్ గెలిచిన ఆనందం అంతా ఇంతా కాదు. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, బుమ్రా, ఇషాన్ కిషన్, శివమ్ దూబె, సంజు శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, సిరాజ్‌లకు ఆ అవకాశం దక్కింది. 2024లో వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భాగమైన వీళ్లందరూ.. 2026లో సొంతగడ్డపై మరోసారి కప్ అందుకొని మురిసిపోయారు. దక్షిణాఫ్రికాతో ఫైనల్లో సూర్యకుమార్ అద్భుతమైన క్యాచ్‌తో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అదే సూర్య ఇప్పుడు భారత జట్టు కెప్టెన్‌గా జట్టుకు కప్ అందించాడు. బ్యాటర్‌గా పెద్ద ప్రభావం చూపకపోయినా.. కెప్టెన్‌గా అతడి ప్రణాళికలే జట్టును విజేతగా నిలిపాయి. లీగ్ దశలో అమెరికాపై జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 49 బంతుల్లోనే 84 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇక బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది. 2024లో 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి జట్టు విజయంలో భాగమైన బుమ్రా.. ఈసారి సొంతగడ్డపై అదరగొట్టేశాడు. ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్లో అతడు వేసిన స్పెల్‌ను వర్ణించేందుకు మాటల్లేవ్. ఈసారి టోర్నీలో 14 వికెట్లు పడగొట్టి ఉమ్మడి అత్యధిక వికెట్లు తీసిన వీరుడిగా నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన÷నైల్లో అద్భుతమైన బౌలింగ్‌తో అదరగొట్టాడు. ఔట్ ఆఫ్ ది బాక్స్ అనే మాటకు సంజు శాంసన్‌ను ఉదాహరణగా చెప్పొచ్చు. అసలు ఇతడు తుది జట్టులోకి రాడు అనుకుంటే.. రావడమే కాదు అద్భుతమైన ఇన్నింగ్స్‌లో అదరగొట్టాడు సంజు. ఆరంభంలో ఒకటి, రెండు అవకాశాలే దక్కినా వాటిల్లోను విఫలమైన అతడు.. కీలక సమయాల్లో ఛాన్స్‌ను 100 శాతం వాడుకున్నాడు. 2024లో భారత జట్టులో ఉన్నా తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన సంజు.. ఈసారి వెస్టిండీస్‌తో సూపర్-8 మ్యాచ్, ఇంగ్లాండ్‌తో సెమీస్, న్యూజిలాండ్‌తో÷నైల్లో అసాధారణ ఇన్నింగ్స్ ఆడాడు. హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, శివమ్ దూబె ఆల్‌రౌండ్ ప్రదర్శనలతో సత్తా చాటారు. స్థిరంగా రాణించలేకపోయినా అవసరమైన ప్రతిసారీ వీళ్లిద్దరూ నిలబడ్డారు. దూబె మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు అండగా నిలిచాడు. ముఖ్యంగా న్యూజిలాండ్‌తో÷నైల్లో (26 నాటౌట్), ఇంగ్లాండ్‌తో సెమీస్‌లో (43)తో అతడు విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ÷నైల్లో భారత్ తడబడిన వేళ అతడు పవర్ హిట్టింగ్‌తో స్కోరును 250కి తీసుకెళ్లాడు. పాండ్య, అక్షర్ సరైన సమయాల్లో స్టైక్ చేస్తూ వికెట్లు తీశారు. మెరుపు ఫీల్డింగ్‌తో అదరగొట్టారు. ఇంగ్లాండ్‌తో సెమీస్‌లో మ్యాచ్ చేజారిపోతున్న సమయంలో అక్షర్ పట్టిన క్యాచ్‌ల గురించి ఎంత చెప్పినా తక్కువే. 2024 అనుభవంతో ఈ ముగ్గురూ రాణించారు. గత రెండు కప్పుల్లో సిరాజ్, కుల్‌దీప్ యాదవ్‌లకు దక్కింది తక్కువ అవకాశాలే కానీ.. ఛాన్స్ వచ్చిన ప్రతిసారీ నిరాశపరచలేదు. అమెరికాపై సిరాజ్... పాకిస్థాన్‌పై కుల్‌దీప్ ప్రభావవంతంగా బౌలింగ్ చేశారు.

టీమిండియాకు రూ. 24.25 కోట్లు

- న్యూజిలాండ్‌కు రూ.13.08 కోట్ల ప్రైజ్ మనీ

ముంబై,మార్చి11(ఆర్ఎన్ఎ): టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా టీమిండియా నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా రెండోసారి, ఓవరాల్‌గా మూడో సారి పొట్టి ప్రపంచ కప్‌ను సగర్వంగా ముద్దాడి చరిత్ర సృష్టించింది. దీంతో భారత జట్టుకు బీసీసీఐ రూ.131కోట్ల భారీ నజరానాను ప్రకటించింది. ఐసీసీ కూడా టోర్నీ ప్రైజ్‌మనీ రూ.103 కోట్లకు సంబంధించిన పంపిణీ వివరాలను వెల్లడించింది. విజేతగా నిలిచిన టీమిండియాకు రూ.24.25 కోట్లు దక్కాయి.

ప్రైజ్ మనీ పంపిణీ ఇలా..

భారత్ (ఛాంపియన్): రూ. 24.25 కోట్లు

న్యూజిలాండ్ (రన్నరప్): రూ.13.08 కోట్లు

సౌతాఫ్రికా (సెమీ ఫైలిస్ట్): రూ.9.24 కోట్లు

ఇంగ్లండ్ (సెమ్గి÷నైలిస్ట్): రూ.8.96 కోట్లు

సూపర్ 8లో నిష్క్రమించిన జట్లకు.. వెస్టిండీస్: రూ.4.95 కోట్లు

పాకిస్థాన్: రూ.4.80 కోట్లు

జింబాబ్వే: రూ.4.52 కోట్లు

శ్రీలంక: రూ.4.37 కోట్లు

లీగ్ స్టేజ్ జట్లకు..

అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, యూఎస్ఏ: తలో రూ.2.85 కోట్లు

స్కాట్లాండ్: రూ.2.56 కోట్లు,ఐర్లాండ్: రూ.2.50 కోట్లు,ఇటలీ, నెదర్లాండ్స్, యూఏఈ, నేపాల్: తలో రూ.2.35 కోట్లు,కెనడా, నమిబియా, ఒమన్: తలో రూ.2.06 కోట్లు అందనున్నాయి.

కెమెరామెన్ పేల్చిన 'విశ్వంభర' బాంబులు

విపరీతమైన ఆలస్యానికి గురై, అభిమానుల సహనాన్ని పరీక్షిస్తూ వచ్చిన విశ్వంభర విడుదల తేదీ ఇప్పటికీ ఖరారు కాలేదు. రెండు సంక్రాంతులు అయిపోయినా ఎలాంటి అప్డేట్ లేక ఫ్యాన్స్ నుంచి నిరసన గళం వినిపిస్తోంది. జాప్యానికి కారణం విజువల్ ఎఫెక్ట్స్ అన్నది అందరికీ తెలిసిన విషయమే అయినా తాజాగా జరిగిన ఒక ఈవెంట్ లో ఈ సినిమా కెమెరామెన్ ఛోటా కె నాయుడు చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. కంప్యూటర్ గ్రాఫిక్స్ ఎక్కువగా ఉండే సినిమాల్లో కెమెరామెన్ బాధ్యత తక్కువగా ఉంటుందని, దర్శకులు ఏం కోరుకుంటారో దాన్నే మేమిస్తామని, క్వాలిటీ సరిగా రాకపోతే దానికి ఛాయాగ్రాహకుడిని బాధ్యుణ్ణి చేయడం ఎంత మాత్రం సరికాదని వివరించారు. అంజికి తల ఎత్తుకుని పని చేసిన నేనే ఇప్పుడు విశ్వంభరకు తల వంచుకుని చేయాల్సి వస్తోందని, నాలుగు వందల కోట్ల బడ్జెట్ కాబట్టి నా మాటే చెల్లుబాటు కావాలనే ధోరణి ఇక్కడ పనికి రాదనీ చెప్పి కొత్త ట్విస్ట్ ఇచ్చారు. విశ్వంభర నిర్మాణంలో ఉన్న టైంలోనే చోటా వల్లే కొంత సమస్య వచ్చిందనే పుకారు ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొట్టింది. దర్శకుడు వసిష్ఠ దాన్ని కొట్టేసినప్పటికీ గాసిప్పులు మాత్రం ఆగలేదు. పరోక్షంగా ఇవాళ చోటా కె నాయుడు దాని గురించి క్లారిటీ ఇచ్చినట్టే. బెస్ట్ అవుట్ ఫుట్ కోసం టీమ్ ఇంకా కష్టపడుతూనే ఉందని, తనవరకు చేయాల్సింది ఇంకేం లేదని కుండబద్దలు కొట్టారు. కాకపోతే తలవంచి పని చేయడమనే మాటే రకరకాల అర్థాలు తీస్తోంది. చోటా కె నాయుడు చెప్పిన ప్రకారం ఇలాంటి సిజి మూవీస్ కి కెమెరామెన్ తో పాటు ఒక స్పెషలిస్ట్ టెక్నీషియన్ ఉంటాడని, అతని అంగీకారం లేకుండా ఒక్క ఫ్రేమ్ కూడా ఓకే కాదని చెప్పిన ఇంకో ఝలక్ ఇచ్చారు. ఏది ఏమైనా ఇప్పుడీ టాపిక్ పుణ్యమాని విశ్వంభర మరోసారి వార్తల్లోకి వచ్చేసింది. చిరంజీవితో చూడాలని ఉంది, అంజి లాంటి ఎన్నో టాప్ నాచ్ బ్లాక్ బస్టర్స్ కు పని చేసిన ఛోటా కె నాయుడుకి విశ్వంభర విషయంలో ఇలాంటి అనుభవం ఎదురు కావడం విచిత్రం. వసిష్ఠ డెబ్యూ మూవీ బింబిసారకు ఛాయాగ్రహణం అందించింది కూడా ఛోటా కె నాయుడేనన్న విషయం ఇక్కడ మర్చిపోకూడదు.

మహేష్ అభిమానులకు హరీష్ సారి



సోషల్ మీడియాలో చాలా అలెర్ట్ గా ఉండాలి. ముఖ్యంగా సెలబ్రిటీలు బిజీగా షెడ్యూల్స్ లో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా క్షణాల వ్యవధిలో నెగటివ్ విషయాలు వైరల్ అయిపోతాయి. నిన్న రాత్రి ఉస్తాద్ భగత్ సింగ్ ని ఉద్దేశించి ఒక అభిమాని బాబ్ రికార్డులు లేపేయాలనే అర్థం వచ్చేలా ట్వీట్ చేశాడు. దానికి స్పందించిన హరీష్ శంకర్ పూర్తిగా చదవకుండానే తథాస్తు అని బదులు ఇచ్చి రీ ట్వీట్ చేశారు. సెకండ్ల వ్యవధిలో జరిగిన తప్పును అర్థం చేసుకుని వెంటనే డిలీట్ చేశారు. ఈలోగానే దాన్ని స్క్రీన్ షాట్లు, వీడియో రూపంలో క్యాప్చర్ చేసిన ఇతర ఫ్యాన్స్ దాన్ని వైరల్ చేశారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ కి ఆగ్రహం కలిగింది. రికార్డులు లేపేయాలని ఉద్దేశించి అతనెవరో పెట్టిన ట్వీట్ కి ఇలా రిప్లై ఇవ్వడం ఏమిటని హరీష్ ని నిలదీస్తూ ఆన్ లైన్ హంగామా చేశారు. డ్యామేజ్ చాలా దూరం వెళ్తోందని గుర్తించిన హరీష్ శంకర్ తాజాగా ఎక్స్ అకౌంట్ లో ఒక సుదీర్ఘమైన మెసేజ్ ద్వారా తన ఉద్దేశాలు వివరించి మనోభావాలు దెబ్బ తిన్న వాళ్లకు క్షమాపణ చెప్పారు. ప్రాక్టికల్ గా చూసుకుంటే స్టార్లను హ్యాండిల్ చేస్తున్న దర్శకులు ఎవరూ ఇతర హీరోల మీద మాట లేదా ట్వీట్ జారరు. దాని వల్ల పరిణామాలు తెలిసి ఉంటాయి కాబట్టి. కానీ కేవలం తొమ్మిది రోజుల రిలీజ్ ఒత్తిడి పెట్టుకున్న హరీష్ శంకర్ ట్వీట్ ని పూర్తిగా చూసుకోకుండా ఉత్సాహంతో ఇచ్చిన సమాధానం వ్యవహారాన్ని చాలా దూరం తీసుకెళ్లింది. వివరణ సందేశంలో అదే చెప్పారు. వారణాసి గురించి, గతంలో పోకిరి గురించి తాను గొప్పగా చెప్పినవి అందులో ఉదహరించారు. మొత్తానికి రాత్రి రచ్చ చేస్తున్న ఇష్యూ ఫైనల్ గా క్షమాపణ దగ్గర ఆగింది. గతంలో ఇదే తరహాలో ఒక అప్ కమింగ్ డైరెక్టర్ చిరంజీవిని ఉద్దేశించినట్టుగా ఉన్న పాత ట్వీట్ ఒకటి బయటికి తీస్తే దాన్ని ట్రోలింగ్ కోసం వాడుకున్న బ్యాచ్ పెద్దదే ఉంది. ఇలాంటివి పెద్దవి అయ్యేదాకా ఆగకూడదు. అందుకే హరీష్ శంకర్ వెంటనే డ్యామేజ్ కంట్రోల్ లోకి దిగిపోయారు. మార్చి 19 విడుదల కాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ కు చివరి దశ పనులు ఆఘమేఘాల మీద జరుగుతున్నాయి. సెన్సార్ అయిపోయింది కాబట్టి టెన్షన్ లేదు.



డైరెక్టర్ హైప్ ఇస్తుంటే... నాగ్ ఫ్యాన్స్‌కు టెన్షన్

టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున వరుసగా తమిళ నటులు, టెక్నీషియన్లతో పని చేస్తున్నాడు. గత ఏడాది ధనుష్‌తో కలిసి నాగ్ నటించిన కుబేర ఓ మోస్తరు ఫలితాన్ని అందుకుంది. కానీ సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమా కూలీలో విలన్ పాత్ర పోషించిన నాగ్‌కు నిరాశ తప్పలేదు. ప్రి రిలీజ్ హైప్ వల్ల సినిమాకు ఓపెనింగ్స్ వచ్చాయి కానీ.. కంటెంట్ పరంగా కూలీ తీవ్ర నిరాశకు గురి చేసింది. నాగ్ పాత్ర విషయంలో ఎంతో ఊహించుకున్న అభిమానులకు తీవ్ర నిరాశ తప్పలేదు. ఈ సినిమాలో నాగ్ క్యారెక్టర్ గురించి రిలీజ్ ముంగిట దర్శకుడు లోకేష్ కనకరాజ్ మామూలు హైప్ ఇవ్వలేదు. చివరికి చూస్తే.. అంతన్నాడింతన్నాడే.. పాట గుర్తుకొచ్చింది నాగ్ క్యారెక్టర్ చూసి. తమిళ హీరోలు తెలుగు దర్శకుల వైపు చూస్తుంటే.. నాగ్ చిత్రంగా వరుసగా తన రెండో సినిమాను కూడా తమిళ దర్శకుడితోనే చేయడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. పైగా అది నాగ్ వందో సినిమా కావడం గమనార్హం. తమిళ యువ దర్శకుడైన రా.కార్తీక్.. నాగ్ మైల్ స్టోన్ మూవీని డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమా గురించి ఇప్పటిదాకా ఎక్కడా మాట్లాడని రా.కార్తీక్.. తొలిసారి తమిళ మీడియాతో మాట్లాడాడు. అతను నాగ్‌కు ఎలవేషన్ ఇచ్చాడు. నాగ్ వందో సినిమా చిత్రీకరణ ప్రస్తుతం నాన్‌స్టాప్‌గా జరుగుతోందని చెప్పిన కార్తీక్.. ఈ సినిమాలో నాగ్ సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తాడని చెప్పాడు. శివ, రక్షకుడు, కూలీ సినిమాల్లో ఎలా అయితే స్టైలిష్ అవతారంలో కనిపించాడో.. అంతే అందంగా ఈ సినిమాలోనూ ఉంటాడన్నాడు. ఈ సినిమాలో నాగ్ మల్టిపుల్ గెటప్స్‌లో కనిపిస్తాడని కూడా కార్తీక్ వెల్లడించాడు. వందో సినిమాకు తెలుగు దర్శకుడిని కాక, తమిళుడైన తననే ఎందుకు ఎంచుకున్నారని అడిగితే.. నీతో నాకు ఓకే అని నాగ్ చెప్పినట్లు కార్తీక్ తెలిపాడు. తన కెరీర్ ఆరంభంలోనే మణిరత్నం సార్‌తో గీతాంజలి చేసిన విషయాన్ని నాగ్ గుర్తు చేసినట్లు కార్తీక్ వెల్లడించాడు. నాగ్ గురించి కార్తీక్ ఇచ్చిన ఎలివేషన్ బాగుంది కానీ.. లోకేష్ కనకరాజ్‌లా విషయం తక్కువ బిల్డప్ ఎక్కువలా కాకుండా మంచి పాత్ర, సినిమాతో నాగ్ మైల్‌స్టోన్ మూవీని మెమొరబుల్‌గా మార్చాలని అక్కినేని అభిమానులు కోరుకుంటున్నారు.

బిజినెస్ న్యూస్

వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలపై నీళ్లు!

మిడిల్‌ఈస్ట్ ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడంతో ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాస్తోంది. దీనివల్ల ఇన్నాళ్లూ వడ్డీ రేట్ల తగ్గింపు కోసం వేచి చూసిన సామాన్యులకు, పెట్టుబడిదారులకు కేంద్ర బ్యాంకులు షాక్ ఇచ్చేలా కనిపిస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించడం పక్కన పెట్టి ఈ ఏడాది చివరి నాటికి మరింత పెంచే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక ప్రకారం, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఈ ఏడాది ఒకటి లేదా రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో రేట్ల తగ్గింపు ఉంటుందని భావించినప్పటికీ చమురు, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడం దీనికి ప్రధాన కారణం. అదేవిధంగా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా రేట్ల పెంపు దిశగా అడుగులు వేస్తోంది. గతంలో రేట్ల కోత ఉంటుందని ఊహించిన మార్కెట్ వర్గాలకు ఇది పెద్ద మలుపు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ద్రవ్యోల్బణంపై కేంద్ర బ్యాంకులు ఆలస్యంగా స్పందించాయనే విమర్శలు ఉన్నాయి. సాధారణంగా ఇంధన ధరల పెరుగుదల తాత్కాలికమని, అధిక ధరల వల్ల డిమాండ్ తగ్గి ధరలు అదుపులోకి వస్తాయని బ్యాంకర్లు భావిస్తారు. అయితే, గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఆలస్యం చేయకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సెంట్రల్ బ్యాంకులు భావిస్తున్నాయి

చికెన్, పిజ్జా, బర్గర్.. కంపెనీలకు కష్టాలు

దేశీయ క్విక్ సర్వీస్ రెస్టారెంట్ విభాగంపై గ్యాస్ సెగ ముసురుతోంది. వాణిజ్య ఎల్‌పీజీ సరఫరాలో ఏర్పడిన అంతరాయం, పెరుగుతున్న ధరల నేపథ్యంలో బుధవారం స్టాక్ మార్కెట్‌లో ప్రధాన క్యూఎస్ఆర్ కంపెనీల షేర్లు మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి. సరఫరా గొలుసులో తలెత్తిన సమస్యలు మరో రెండు వారాలకు పైగా కొనసాగితే కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందన్న విశ్లేషణలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేఎం ఫైనాన్షియల్ తాజా నివేదికలో క్యూఎస్ఆర్ విభాగం ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించింది. ప్రధాన క్యూఎస్ఆర్ చైన్‌లో దాదాపు 60-65 శాతం వంట ప్రక్రియ పూర్తిగా ఎల్‌పీజీపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ సంస్థలు కేవలం ఒకటి నుంచి రెండు వారాలకు సరిపడా గ్యాస్ నిల్వలను మాత్రమే కలిగి ఉన్నాయి. సరఫరా లోటు కారణంగా మార్చి నెలలోనే వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర 8 శాతం మేర పెరిగింది. ఇది నేరుగా రెస్టారెంట్ల నిర్వహణ వ్యయాన్ని పెంచుతోంది. ఒకవేళ సరఫరా నిలిచిపోయి, రెస్టారెంట్లు ఐదు రోజుల పాటు మూతపడితే ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది. త్రైమాసిక ప్రాతిపదికన ప్రతి స్టోర్ ఆదాయం 6 శాతం తగ్గే అవకాశం ఉంది. రెస్టారెంట్ స్థాయి ఎబిటా మార్జిన్లు సాధారణం కంటే 14-20 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ప్రభుత్వం గృహ అవసరాలకు వాడే గ్యాస్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. ఈ క్రమంలో వాణిజ్య వినియోగదారులపై రేషనింగ్(ప్రాధాన్యత క్రమంలో పరిమితంగా పంపిణీ చేయడం) విధించడం రెస్టారెంట్లకు శాపంగా మారింది. పెద్ద సంస్థల కంటే చిన్న, స్వతంత్ర రెస్టారెంట్లు ఈ సంక్షోభానికి త్వరగా ప్రభావితమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. హార్ముజ్ జలసంధి వంటి కీలక షిప్పింగ్ మార్గాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం వల్ల ఎల్‌పీజీ దిగుమతులకు ఆటంకం కలుగుతోంది. ఈ అనిశ్చితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రెస్టారెంట్ విభాగం ప్రత్యామ్నాయ ఇంధన వనరులు (విద్యుత్ ఆధారిత వంట పరికరాలు) లేదా సెంట్రలైజ్డ్ కిచెన్ మౌలిక సదుపాయాల వైపు మళ్లక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

రైల్వే కేటరింగ్‌కూ ఎల్‌పీజీ సెగ.. వెండర్లకు ఐఆర్‌సీటీసీ సూచనలు

దిల్లీ: దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా కమర్షియల్ సిలిండర్ల సరఫరా తగ్గడంతో హోటళ్లు, రెస్టారంట్లు మూతపడుతున్నాయి. తాజాగా ఈ ప్రభావం రైల్వే కేటరింగ్‌నూ తాకింది. దీంతో ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ వెండర్లకు కీలక సూచనలు చేసింది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరింది. రైల్వేస్టేషన్లలో ఉండే ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జనాహార్ కేంద్రాలకు ఐఆర్‌సీటీసీ మార్చి 10న ఓ అడ్వైజరీ జారీ చేసింది. ఎల్‌పీజీకి తీవ్రమైన కొరత ఏర్పడిన వేళ ప్రత్యామ్నాయ వంట పద్ధతులను అనుసరించాలని అందులో పేర్కొంది. ఎల్‌పీజీకి బదులు మైక్రోవేవ్‌లు, ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించాలని తెలిపింది. పాసింజర్ డిమాండ్‌కు అనుగుణంగా రెడీ టూ ఈట్ ఫుడ్ ఐటెమ్స్‌ను తగినంత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరా తగ్గింది. కృత్రిమ కొరతను నివారించడానికి కేంద్రం సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచింది. ముఖ్యంగా గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం చమురు కంపెనీలకు సూచించింది. దీంతో కమర్షియల్ సిలిండర్లకు కొరత ఏర్పడింది. ఫలితంగా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారంట్లపై ప్రభావం పడింది. పలు హాస్టళ్లు, మెస్‌లు తమ మెనూల నుంచి కొన్ని ఆహార పదార్థాలను తొలగిస్తున్నాయి. కొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్లకు బదులు కట్టెల పొయ్యిలు, బొగ్గు కుంపట్లను వినియోగిస్తున్నారు.

మార్కెట్ క్రాష్.. 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలకు ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి బుధవారం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో నేటి ట్రేడింగ్‌లో దేశీయ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి సెన్సెక్స్ ఒకదశలో 1000 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 24వేల వద్ద కదలాడుతోంది. ఉదయం 11.50 గంటల సమయంలో సెన్సెక్స్ 943 పాయింట్లు క్షీణించి, 77,262 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 259 పాయింట్లు నష్టపోయి 24,002 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, అదానీ ఫార్మా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎంఅండ్ఎం, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన మదుపర్లు ఒత్తిడికి గురవుతున్నారు. దాంతో నిన్నటి లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఇక ఈ యుద్ధం త్వరలో ముగియొచ్చని ట్రంప్ చెప్పినప్పటికీ.. పశ్చిమాసియాలో దాడులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు ప్రభావం చూపించాయి. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ముడిచమురు ధరలు మంగళవారం ఒక బ్యారెల్‌కు 10 శాతానికి పైగా తగ్గినా.. అస్థిరతలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. భారత్ ప్రధానంగా దిగుమతులపై ఆధారపడటమే ఇందుకు కారణం. దీంతో నేటి ట్రేడింగ్‌లో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. తర్వాత ఒక శాతం మేర కుంగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.89గా ఉంది

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రథమ స్థానంలో నిలుపుదాం: కమిషనర్

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతిని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలేక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్, ఆధ్వర్యంలో బుధవారం కచ్చపి ఆడిటోరియంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరం స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రజలు, అధికారులు, సిబ్బంది అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది చేసిన తప్పులు పునరావృతం కాకుండా అందరూ సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. చెత్తను వేరు చేయడం, తరలింపు, ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, పలు ప్రాంతాలను సుందరీకరణ చేయడంలో వెనుకబడ్డామని తెలిపారు. ముఖ్యంగా చెత్త సేకరణకు వెళ్లే వారు ప్రజలతో మార్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. పారిశుద్ధ్యం, సుందరీకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, డ్రైనేజి శుభ్రం చేయడం వంటివి బాగా చేయాలని అన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ స్థానం సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ శిక్షకులు శ్రీనివాస్, స్వర్ణ వార్డు కార్యదర్సులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా సంగరాజు అశ్విని

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' దక్షిణ భారత దేశ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన సంగరాజు అశ్విని నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు ఆమెకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. అశ్విని విద్యార్హతలు, ఆమెకు ఉన్న అనుభవం, నైపుణ్యాలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు సంస్థ పేర్కొంది. తమ సంస్థ అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషిస్తారని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. ఆమె ఇకపై ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ మిస్టర్ బింగి నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇటువంటి సంస్థలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల అశ్విని సంతోషం వ్యక్తం చేశారు. ఈ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

గణనాధుని సేవలో బ్యాండ్ మేళం సినిమా బృందం

కాణిపాకం, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం బ్యాండ్ మేళం సినిమా బృందం ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, కామెడీ యాక్టర్ అవినాష్, హీరో హర్ష రోషన్, హీరోయిన్ శ్రీదేవి బుధవారం కాణిపాకం విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకే కేటాయించాలి: సిపిఐ

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): 2014 నుండి 19 వరకు టిడిపి అధికారంలో ఉన్నది 2019 నుండి 24 వరకు వైసిపి జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నారు. గడచిన ఈ పది సంవత్సరాల కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులు పేదలను గుర్తించి లిస్టులను తయారుచేసి వారి వద్ద నుండి రూ.45 వేల నుండి రూ.లక్ష వరకు డిపాజిట్ల రూపంలో లక్షలాదిమంది పేదల వద్ద నుండి ప్రభుత్వం డబ్బులు కట్టించుకుంది. అయితే వారి ఆశలు అడియాశలు చేస్తూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లబ్ధిదారులు చెల్లించిన డబ్బులు 12 సంవత్సరాల తర్వాత వారికి తిరిగి చేస్తాం అంటూ ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ నాయకుల కను సన్నలలో లబ్ధిదారుల లిస్టును మార్చివేసి అవినీతికి అడ్డాగా అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రి లిస్టులు మార్చి కొత్తవారిని అధికార పార్టీకి చెందిన వారికి డబ్బులు ఇచ్చేవారిని గుర్తించి వారికి టిట్కో ఇళ్లను ఇచ్చేందుకు ఒక ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతుంది. కలెక్టర్ స్పందించి నిజమైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందేలా చూడాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు.



మార్చి 17న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మార్చి 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా మార్చి 18వ తేది విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రారంభోత్సవం

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రకాశం రోడ్డు-1 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు గర్భాశయ క్యాన్సర్ నివారణకు HPV టీకా కార్యక్రమాన్ని డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి చేతుల మీదుగా ప్రారంభించారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపట్టిందని, అలాగే 14 ఏళ్ల వయసున్న అమ్మాయిలకు హెచ్పీవీ వైరస్ సోకకుండా ముందస్తు వ్యాక్సినేషన్ వేసేందుకు నేటి నుంచి ఏర్పాట్లు చేసిందని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యంధ్రా లోనూ అలాగే పట్టణ ఆరోగ్యంధ్రా లోనూ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని తెలియచేసారు. జిల్లాలోని వైద్య సిబ్బంది అందరూ కూడా వారి పరిధిలో ఉన్నటువంటి 14 సంవత్సరంలో బాలికలు అందరికీ కూడా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ తర్వాత ఈ వ్యాక్సిన్ వేయాలని ఏరోజుకారోజు జిల్లా కార్యాలయానికి రిపోర్ట్‌ను పంపాలని డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. మహిళల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముందు వరసలో ఉంటుంది, ఈ వ్యాధి బారిన పడకుండా జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 14455 మంది 14 సంవత్సరముల బాలికలందరికీ గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణకు HPV (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా అందించటం జరుగుతుందని డాక్టర్ శాంత కుమారి జిల్లా ఇమునైజేషన్ అధికారి తెలియజేసారు. సదురు కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచేంద్రియాల్లో కళ్ళు ఎంతో ప్రధానం

- సిఆర్ఎస్ సీనియర్ డిఎంఓ డాక్టర్ హిమజా భాయ్

- గ్లోకోమా పట్ల అప్రమత్తంగా ఉండాలి: ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కావ్య

రేణిగుంట, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): సర్వేంద్రియానామ్ నయనం ప్రధానం అన్నట్లు మనకున్న పంచేంద్రియాల్లో కళ్ళు ఎంతో ప్రధానమైనవి అటువంటి కళ్ళను మనం ఎంత బాగా చూసుకుంటే అవి మనల్ని అంత బాగా చూసుకుంటాయని సిఆర్ఎస్ సీనియర్ డిఎంఓ డాక్టర్ హిమజా భాయ్ పేర్కొన్నారు. సిఆర్ఎస్ సమీపం రైల్వే ఇన్స్టిట్యూట్‌లో కార్మికులకు, రిటైర్డ్ కార్మికులకు తుడా రోడ్ లోని వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించి కార్మికులకు కళ్ళపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డబ్ల్యూపిఓ శ్రీనివాస్ నాయక్, డిఎంఓ డాక్టర్ హిమజా భాయి, ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కావ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో దాదాపు 175 మంది కార్మికులు పాల్గొని క్యాట్రాక్ట్, రెటీనా, గ్లూకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో డబ్ల్యూపిఓ శ్రీనివాస్ నాయక్ కుటుంబ సమేతంగా కంటి పరీక్షలు చేయించుకుని అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఆర్ఎస్‌లో పనిచేసే కార్మికుల కంటి ఆరోగ్య రక్షణలో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాక రైల్వే హాస్పిటల్‌లో ప్రతి గురువారం ఆప్తమాలజీ వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ హిమజ భాయ్ మాట్లాడుతూ గతంలో 40 ఏళ్లు దాటితే కానీ కళ్ళ ఇబ్బందులు వచ్చేవి కాదు, కానీ ఇప్పుడు 4 సంవత్సరాల పిల్ల వాళ్ల నుంచి కంటి అద్దాలు వాడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకుంటూ కళ్ళను కాపాడుకోవాలని ఆమె సూచించారు. ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కావ్య మాట్లాడుతూ కళ్ళకు వచ్చే ఎంతో ప్రమాదకరమైన గ్లకోమాపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కళ్ళకు ప్రెషర్ ఎక్కువ అయినప్పుడు కంటిలోని రెటీనా పొర దెబ్బ తినడం వలన చూపు తగ్గి అది గ్లోకోమాగా మారి క్రమక్రమంగా పూర్తిగా చూపుకోల్పోతారన్నారు. కార్యక్రమంలో సిఆర్ఎస్ హాస్పిటల్ సిబ్బంది హేమలత, యువ, హెల్త్ ఇన్స్పెక్టర్ హేమరాజ్ మీనా, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ అసిస్టెంట్ మేనేజర్ ధర్మ, సిబ్బంది సుజాత, అంబికా తదితరులు పాల్గొన్నారు.

అన్న కాంటీన్లలో నాణ్యమైన ఆహారం అందిద్దాం!

- దాతలు విరాళాలు ఇవ్వండి: కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): అన్న కాంటీన్ల ద్వారా ప్రజలకు మరింత నాణ్యతతో, పరిశుభ్రతతో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కమిటి సభ్యులకు, అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్న కాంటీన్ల నిర్వహణ, కమిటీ బాధ్యతలపై సలహా మండలి సభ్యులు, అధికారులతో, అక్షయ పాత్ర ప్రతినిధులు, క్యాంటీన్ నిర్వాహకులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఐదు రూపాయలకే నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా ప్రభుత్వం అన్న కాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కాంటీన్ల ద్వారా ఇప్పటికే నాణ్యమైన, పరిశుభ్రతతో కూడిన ఆహార పదార్థలను అందిస్తున్నామని తెలిపారు. అయితే మరింత నాణ్యతతో, కాంటీన్లను మెరుగ్గా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్న కాంటీన్లను శుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా కమిటీ సభ్యులు, అధికారులు అన్న కాంటీన్లను పరిశీలించాలని తెలిపారు. ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాయం అందించేలా దాతలతో సంప్రదించాలని తెలిపారు. వీల్ చైర్లో వచ్చే వారి కొరకు ర్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్న కాంటీన్ల సి.ఈ.ఓ వంశిధర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 205 కాంటీన్లు నిర్వాహస్తున్నామని, నూతనంగా 70 కాంటీన్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పుట్టినరోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక రోజుల్లో డొనేషన్ చేస్తే దాత పేరు, తదితర వివరాలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తామని తెలిపారు. రూ.2 వేలు పైన విరాళం ఇస్తే పాన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. సలహా మండలి సభ్యులు ఆర్.సి. మునికృష్ణ(తిరుపతి), ఎస్.కె.బాబు(తిరుపతి), సి.కె.రేవతి(తిరుపతి), రాధ(పుత్తూరు), ప్రభావతి (వేంకటగిరి), డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవిన్యూ అధికారి సేతు మాధవ్, అక్షయ పాత్ర, హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులు శివ గణేష్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకంలో పాల్గొన్న శృంగేరి పీఠాధిపతి

శ్రీకాళహస్తి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): జగద్గురు భారతి మహాస్వామి జీ, శ్రీశ్రీ జగద్గురు మహా సంస్థానం శృంగేరి పీఠం వారు బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేశారు. జగద్గురు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి జీ, శ్రీశ్రీ జగద్గురు మహా సంస్థానం శృంగేరి పీఠం వారిని భిక్షాల గోపురం వద్ద శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, దంపతులు ఆహ్వానించారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల రుద్రా అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు, ఆలయ చిత్ర పటం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయ ఇఓ బికే వెంకటేశులు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, పగడాల మురళి, లక్ష్మమ్మ, సావిత్రి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, ప్రోటోకాల్ ఎఈఓ మోహన్, ఎఈఓ హేమామాలిని, లోకేష్ బాబు, పర్యవేక్షకులు నాగభూషణం, శ్రీహరి, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతరాయ విద్యుత్తు సరఫరా!

- సోలార్ విద్యుత్‌పై విస్తృత అవగాహన - పిఎం-కుసుమ్, ఆర్ డిఎస్ఎస్ పనులు వేగవంతం

- సమీక్షా సమావేశంలో సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి,మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి): వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ పరిధిలో చీఫ్ ఇంజనీర్ స్థాయి నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు హాజరైన అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు మెరుగైన, సత్వర సేవలను అందించడం ద్వారా వినియోగదారుల నుంచి మన్ననలు పొందాలని సూచించారు. విద్యుత్ సరఫరా తీరుపై సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ స్థాయిల్లో సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ, అంతరాయాలను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలందించాలని కోరారు. వినియోగదారుల సేవల్లో అలసత్వాన్ని దరి చేరనీయవద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందుతున్నాయని, సిబ్బంది పనితీరు మరింత మెరుగు పడాల్సిన అవసరం వుందన్నారు. సంస్థ పరిధిలో అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులు అందినట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. సంస్థ పరిధిలో పిఎం-సూర్యఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పిఎం-కుసుమ్ పథకం కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా వ్యవసాయానికి మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా విద్యుత్ పునర్వ్యవస్థీకరణ పంపిణీ పథకం (ఆర్ డిఎస్ఎస్) పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 11కెవి ఫీడర్లకు, డిటిఆర్ లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని, వినియోగ దారులు అడిగిన వెంటనే సర్వీసులను మంజూరు చేయాలని సూచించారు. సంస్థ పరిధిలో ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే మార్చాలని ఆదేశించారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, చాట్బోట్ నంబరు: 91333 31912తో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్(టెక్నికల్, హెచ్ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్ఎసి) కె.రామమోహన రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, కె.ఆదిశేషయ్య, ఎం.కృష్ణా రెడ్డి, ఎం.ఉమాపతి, కె.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎం.మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు/సూపరింటెండింగ్ ఇంజనీర్లు మురళీధర్, విజయన్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, జగదీష్, తిరుమల రావు, సుబ్బారావు, రవి కుమార్. హేమలత, రమణ, ఇస్మాయిల్ అహ్మద్, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్, రాఘవేంద్రం, చంద్రశేఖర్ రావు, సోమశేఖర్ రెడ్డి మోజెస్ లతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027